# ఘనంగా శ్రీపెద్దపల్లి గంగమ్మ రథోత్సవం

కుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



స్థానిక కొత్తపేటలో వెలసిన శ్రీప్రసన్న పెద్దపల్లి గంగమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. ఆదివారం అమ్మవారి రథోత్సవ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ చేసి రథంపై పుర వీధుల్లో ఊరేగించారు. మొక్కులు కలిగిన భక్తులు రథంపై అరటిపళ్లు, చిల్లర నాణేలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి అమ్మవారి కళ్యాణోత్సవం కను ్నలపండువగా జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త శివకుమార్, కార్యదర్శి వెంకటేశు, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## రథసారథి మారినా...

# మారని పార్టీ దిశ, దశ

### -ఇదీ తిరుపతిలో వికాసం లేని కమలం !



ప్రభాతవార్త-తిరుపతి: మూడు వర్గాలు ఆరు గ్రూపులుగా తిరుపతి జిల్లాలో బిజెపి పార్టీ పరిస్తితి అధ్వాన్నంగా ఉందని జనం చర్చసాగుతోంది. ఇటీవల తిరుపతిలో జరిగిన కమల వికాసం కార్యక్రమంలో జరిగిన ఒక సంఘటనే దీనికి తార్కాణం. రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే పోటీకి సిద్ధంగా ఉన్నవారిని లేవమని కోరారు. కేవలం ముగ్గురు మాత్రమే పైకి లేచినట్లు తెలిసింది. ఎన్ని డివిజన్లు ఉన్నాయని అడిగితే తడబడుతూ కొందరు 52 అన్నట్లు తెలిసింది. దీంతో ఆయన కొంత ఆగ్రహం వ్యక్తం చేశారని సమాచారం. కొత్తగా తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా న్యాయవాది సామంచి శ్రీనివాస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆయన చాలా చురుకైన వారైనప్పటికి కొందరు నాయకులు ఆయనకు సహకరించడం లేదని అంటున్నారు. మూడు వర్గాలు ఆరు గ్రూపులు అన్నట్టు ఎవరికి వారు వ్యవహరిస్తున్నారు. సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్ రెడ్డి, కోలా ఆనంద్, చంద్రప్ప, శాంతా రెడ్డి, కొందరు మహిళా నేతల మధ్య సమన్వయం కనిపించడం లేదనేది కూటమి పార్టీల్లో గుసగుసలు. ఎవరికి వారు రాష్ట్ర, జాతీయ నాయకులు వచ్చినపుడు శాలువాలు కప్పడం, స్వాగతం పలకడం, ఫోటోలు తీసుకుని సోషల్ మీడియాలో పెట్టడానికే పరిమితం అయ్యారు.

దీనితో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కూడా పార్టీ కార్యక్రమాల నిర్వహణకే పరిమితం అయ్యారు. ప్రల్లోకి వెళ్ళడం, సమస్యల మీద పోరాటం చేయడం మానేశారు. పేరుకు క్యాడర్ బేస్డ్ పార్టీ అయినప్పటికీ కార్యకర్తలను పెంచుకునే కృషి జరగడం లేదు. వైసిపి నేత భూమన కరుణాకర్ రెడ్డి ఇతర నేతల విమర్శలను ఖండించే సాహసం ఎవరూ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతిలో బిజెపికి అనుకూలంగా పనిచేసే ఆర్ ఎస్ ఎస్, విశ్వహిందూ పరిషత్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇతర సంస్థలు ఉనికి చాటుకునే పనిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ పటిష్ఠతపై అధిష్టానం మరింత సహకారం అందించాల్సి ఉంది.

# అటకెక్కిన అపాచిని ఎప్పుడు అమలు చేస్తారు?

### రైతుల పరిహారం చెల్లింపులకు ఏళ్ళు . . .ప్రకటనల్లో ప్రగతి: ఆచరణలో అధోగతి





2022లో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పైలాన్ ఆవిష్కరించిన దృశ్యం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో 2022 జూన్ 23న అప్పటి ముఖ్యమంత్రి వైయస్‌జగన్మోహన్‌రెడ్డి పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకం అంటూ గొప్పలు చెబుతూ పలు పరిశ్రమలకుశంకు స్థాపన,భూమి పూజలు,వర్చువల్ ప్రారంభోత్సవాలు చేసారు. వారు అధికారంలో ఉన్న మూడేళ్ల శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారు.వాటి గురించి శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రతినిధి కూడా పట్టించుకోలేదు. ఏర్పేడు-వెంకటగిరి జాతీయ రహదారి పక్కన ఇనగలూరు వద్ద 300 ఎకరాల భూమిని అపాచి పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించారు. రూ.800కోట్ల పెట్టుబడితో 10వేల మందికి ఉపాధి అని ఇందులో 80శాతం మహిళలకే అని నాడు బల్లగుద్ది ముఖ్యమంత్రి ప్రకటించారు. పైలాన్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి మూడేళ్ళలో అతిగతీ పట్టించుకోలేదు.

**నాటి ప్రారంభోత్సవాలు ఇదే:**

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాల్లో విమానాశ్రయం దగ్గరగా పలు కీలక పరిశ్రమలు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. టిసిఎల్ టివి ప్యానల్స్ ను యూనిట్‌ను రూ.1230కోట్లు అంచనాలతో చేపట్టబడి ఇప్పటికే ఆ కంపెనీ రూ.1040కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు.ఈ పరిశ్రమ ద్వారా 3174 మందికి ఉపాధి కల్పన లక్ష్యం అని నాటి సభలో ముఖ్యమంత్రి వివరించారు. మరో కంపెనీ సన్ని ఆపో టెక్ ఈ పరిశ్రమ కెమెరాల మాడ్యూల్స్‌ను తయారు చేస్తారు. మొబైల్‌ఫోన్లను రూపకల్పన చేస్తారు. ఆటో ఫోకర్.జూమ్ మల్టిలేయర్ కోటింగ్ తయారు చేస్తారు. బడ్జెట్ రూ280కోట్లు దీని ద్వారా సుమారు 1200 మందికి ఉపాధి కల్పన అవకాశం ఉంటుందని చెప్పుకొచ్చారు. అంతేకాక ఫిక్సోలింక్ ఉత్పత్తులను కూడా ఆయన ప్రారంభించారు. ఇది ప్రింటండ్ సర్క్యూట్ బోర్డు,హెపి ప్రిన్‌టర్స్ ఆపిల్ పెన్సిల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది.ఈ కంపెనీ రూ.1050కోట్లు పెట్టుబడి అంచనాలతో ప్రారంభించి ఇప్పటికేరూ.450కోట్లు విడుదల చేసారు. దీని ద్వారా 1200 మందికి జీవనోపాధి కల్పించబడుతుందని గొప్పలు చెబుతూ బహిరంగ సభ జరిపారు.

**ఐదేళ్లుగా పరిష్కారం కాని భూ సమస్య:**

శ్రీకాళహస్తి నియోజకవర్గం సముద్రానికి సమీపంలో ఉండటంతో దీనిని కూటమి ప్రభుత్వం పారిశ్రామిక కారిడార్‌గా తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.అయితే ప్రభుత్వం రికార్డుల్లో భూములను కేటాయిస్తుంది. కానీ ఆచరణలో అమలు జరగటం లేదు. ఇదే పరిస్థితి 'ఆపాచి'ది కూడా వేల మందికి అందులోనూ మహిళలకు ఉపాధి అవకాశం ఉన్న పరిశ్రమ ఏర్పాటుకు రైతులకు సంబందించి భూముల పరిహారం చెల్లింపులో జాప్యంతో పరిశ్రమ అమలు ప్రశ్నార్థకంగా మారింది.ఐదేళ్ల గడుస్తున్న రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం విషయంలో ఎందుకు రెవెన్యూశాఖ తాత్సారం చేస్తుందో ఆ ముక్కంటీశునికే ఎరుక.నాడు ఇక్కడ పరిశ్రమకు ప్రభుత్వం తక్కువ రేటుకు భూములు కేటాయించింది. నేడు ఇక్కడ ఎకరా రూ.కోటి పలుకుతుంది.శ్రీకాళహస్తి మండలంలో పరిశ్రమలకు కోట్ల రూపాయల భూములను కేటాయిస్తున్నారు.కానీ పరిశ్రమలు రికార్డుల్లోనే మిగులుతుంది. ఆపాచి పరిశ్ర మ ఏర్పాటుకు కొ ంత వరకు మట్టిపనులు కూడా చేసారు.కానీ రైతుల పరిహారం చెల్లింపుల్లో అధికారుల నిర్లక్ష్యంతో సమస్య కోర్టు గడప ఎక్కింది. దాంతో అపాచి అటకెక్కింది. మరి ఈ పరిశ్రమకు మంచిరోజులు ఎ ప్పుడు వస్తాయో? ఏమో? అలాగే మన్నవరం వద్ద భెల్ పరిశ్రమ పెట్టుబడులు పెట్టలేదు కాబట్టి వారికి ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని తిరిగి తీసుకోవటానికి ఏడాది క్రితం శాసనసభ్యుడు కలెక్టర్‌తో పర్యటించారు. ఆదేశించారు. అయితే ఈ సమస్య కూడా పరిష్కరింపబడులేదు. ఇలా శ్రీకాళహస్తిలో పరిశ్రమల స్థాపన కేవలం రికార్డులకే పరిమితమౌతుంది. నిరుద్యోగులేమో? ఎదురుచూసుకుంటున్నారు.

### తిరుచానూరులో గొడవలపై

# సడలని ఉద్రిక్తత

### -కేసులు నమోదుపై ఆక్రోశం





తిరుపతి/తిరుచానూరు,ఏప్రిల్ 12ప్రభాతవార్త:

పవిత్రమైన పద్మావతిఅమ్మవారు కొలువైన తిరుచానూరులో పోలీస్‌స్టేషన్ సమీపంలోనే తలెత్తిన గొడవలు చివరకు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీశాయి. ఆదివారం సాయంత్రం వరకు తిరుచానూరులో అటు స్థానికులు ఇటు భక్తులు భయాందోళన మధ్య గడపాల్సిన దుస్థితి నెలకొంది. అటు ఆలయానికి చెందిన వాహనమోతదారులు ఇటు వైసిపి నేతల కుటుంబాలతో పోలీస్ స్టేషన్ ప్రాంతం రచ్చరచ్చగా మారింది. దీనివెనుక కారణాలు ఏమైనా అమ్మవారు కొలువైన ప్రశాంత ప్రాంతంలో ఈ దాడులు పుణ్యక్షేత్ర పవిత్రతను దెబ్బతీసేలా మారడం విచారకరమని జనం వాపోతున్నారు.పద్మావతి అమ్మవారి ఆలయ సమీపంలో శనివారం రాత్రి ద్విచక్ర వాహదారుడిని సైడ్ ఇవ్వమన్నందుకు చోటుచేసుకున్న ఈ పెద్ద గొడవల్లో చంద్రగిరి నుండి వచ్చిన అమ్మవారి వాహన మోతదారులు తిరిగి వెళ్ళే సమయంలో ఈ ఘటన జరగడంతో అంతా ఉద్రిక్తతగా మారింది. తిరుచానూరుకు చెందిన దూర్వాసులురెడ్డి(వాసు) వాహన బేరర్ మహేషతో వాసుకు గొడవ తలెత్తింది.దీంతో పక్కనున్న వాహన బేరర్లు వాసుపై దాడి చేశారు. పరస్పరం స్నేహితులు, అనుచరులు చేరుకోవడంతో తీవ్రస్థాయిలో గొడవలు సాగాయి. ఆదివారం ఉదయం నుండి స్టేషన్ ప్రాంతం మాత్రం రచ్చరచ్చగా మారింది. వాహనమోతదారులపై జరిగిన దాడి కేసులో 19 మందిపై కేసు నమోదు చేసినటులన తిరుచానూరు సిఐ సునీల్‌కుమార్ తెలిపారు. అయితే తతమ వారిపై అక్రమంగా పోలీసులు కేసులు నమోదు చేశారంటూ మహిళలు పోలీసు స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన చేశారు. ఓ వైపు ఎమ్మెల్యే డౌన్ డౌన్..ఎస్పీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడంతో మరింతగా పరిస్థితులు మారాయి. పోలీసులు చేసేది లేక తలలుపట్టుకునే పరిస్థితి వచ్చింది. ముందుగా దాడి చేసిన వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదంటూ పోలీసులను మహిళలు నిలదీశారు. అయితే అమ్మవారి ఆలయ వాహన మోతదారులపై గొడవ మాత్రం తీవ్రంగానే తయారైంది.

### చెరువులో మునిగి

# కూలీ గల్లంతు

### గంగినాయనపల్లి విషాదం



బైరెడ్డిపల్లి ఏప్రిల్ 12 ప్రభాతవార్త

మండలంలోని గంగినాయనపల్లి గ్రామంలో వినాయకుని ఆలయ నిర్మాణ పనుల కోసం వచ్చిన కూలీలలో ఒకరు చెరువులో మునిగి గల్లంతు అయిన సంఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. గంగి నాయనపల్లి గ్రామానికి చెందిన వినాయకుని గుడి నిర్మాణ పనుల నిమిత్తం ఢిల్లీ దొరయ్య, ప్రశాంత్ (పలమనేరు), గంగాధర్ (పలమనేరు), యశ్వంత్ (పలమనేరు) అనే నలుగురు కూలీలు అక్కడికి వచ్చారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో తీవ్ర వేడి ఉండటంతో సమీపంలోని బైరెడ్డిపల్లి పెద్ద చెరువుకు (దామురివద్ద)ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత కొడుతున్న సమయంలో ఢిల్లీ దొరయ్య 22సం, అనే వ్యక్తి అకస్మాత్తుగా నీటిలో గల్లంతైనట్లు తోటి కూలీలు తెలిపారు. వెంటనే చుట్టుపక్కల వారు వెతికినా అతని ఆచూకీ లభించలేదు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం మేరకు గతంలో చెరువులో ఇసుక తవ్వకాల సమయంలో జెసిబి సహాయంతో లోతైన గుంతలు ఏర్పడినట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో 20 నుంచి 30 అడుగుల వరకు లోతు ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

**ఐపిఎల్ బెట్టింగ్, లాటరీలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు: - ఎస్పీ తుషార్ డూడి** 2లో

# మే 5 నుంచి 13 వరకు తిరుపతి గంగజాతర

### చాటింపుతో ప్రారంభం..విశ్వరూప దర్శనంతో ముగింపు
### భక్తులకు అన్ని సౌకర్యాలు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు





తిరుపతి విద్య ఏప్రిల్ 12 ప్రభాత వార్త

తిరుపతిలో ప్రసిద్ధ తాతయ్యగుంట గంగమ్మ జాతరను మే 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఉదయం గంగజాతర ఆహ్వాన పత్రిక, కరపత్రం, గోడ పత్రికలను ఆయన ఆవిష్కరించారు.మే 5వ తేదీ రాత్రి చాటింపుతో జాతర ప్రారంభమై, మే 13వ తేదీ తెల్లవారుజామున విశ్వరూప దర్శనంతో ముగుస్తుందని ఆయన వెల్లడించారు. మే 12వ తేదీన గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.జాతర ఏర్పాట్లను ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో సభ్యులు నిత్యం పర్యవేక్షి స్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాయలసీమతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, దర్శనానికి ప్రాధాన్యత ఇస్తామని ఆయన అన్నారు. గంగమ్మ జాతరను రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తామని ఆలయ పాలకమండలి ఛైర్మన్ మహేష్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ్మ, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, శ్యాప్ ఛైర్మన్ రవి నాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి, జెబి శ్రీనివాస్, పులుగోరు మురళీ, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణా, తోట వాసు, ఎస్‌విఎం శ్రీధర్ తదితరులు

# ఒంటరి మహిళలే టార్గెట్

### -హత్యకేసులను చేధించిన తిరుపతి జిల్లా పోలీసులు

తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి:

తిరుపతి జిల్లా పరిధిలో జరిగిన సంచలనాత్మకమైన తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో నమోదైన రెండు హత్య కేసులు, తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధి లో ఒక దోపిడి కేసు తో పాటు పిచ్చాటూర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన నాలుగు కేసుల మిస్టరీ ని తిరుపతి జిల్లా పోలీసులు చేధించారు. అంతర్‌రాష్ట్ర హతంకుడు ఎ.ఎం. అజీజ్ అబ్దుల్ అజీజ్ కర్ణాటక అజీజ్ గా గుర్తించారు. 2018 వ సంవత్సరంలో కేరళ పోలీసుల కస్టడీ నుండి తప్పించుకుని తిరుగుతున్న ఎ.ఎం. అజీజ్ అనే అబ్దుల్ అజీజ్ అప్పట్లో అతని ఆచూకీ తెలిపిన వారికికేరళ పోలీస్ శాఖ రెండు లక్షల రివార్డు ప్రకటించింది. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం సుమారు 21 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కి చెందిన విశ్వనాథ్ యొక్క ఆధార్ కార్డుని తన గుర్తింపు నిమిత్తం ఉపయో గించి





నట్లు పోలీసులు నిర్ధారణ చేశారు. ముద్దాయి నుండి వచ్చిన సమాచారంతో నేరాల లో అతనికి సహకరించిన వెదురుకుప్పం మండలానికి చెందిన రాజమ్మ ను అరెస్ట్ చేసి, సుమారు రూ.20.5 లక్షల విలువ కలిగిన 127.5 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 48 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు, నేరాలకు ఉపయో గించిన ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ లంకెలసుబ్బరాయుడు ఆదివారం మీడియాకు వెల్లడించారు. క్రైమ్ అదనపు ఎస్పీ ఏ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో డిఎస్పీ శ్యామ్‌సుందర్, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడంతో ఈకేపు చేధించడం సులభమైంది. దర్యాప్తు బృందం లో తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఏ. శ్రీనివాసులు, క్రైమ్ డిఎస్పీ వై.శ్యామ్ సుందర్, పుత్తూరు డిఎస్పీ జి.రవికుమార్ క్రైమ్ సిఐలు ఎన్. శివకుమార్ రెడ్డి, ఎం. దివాకర్ రెడ్డి, తిరుచానూరు సిఐ బి. సునీల్ కుమార్, పుత్తూరు రూరల్ సిఐ జి. రవీంద్ర, ఎస్ఐలు యం.నాగార్జున రెడ్డి, చిరంజీవి, సుభాన్ నాయక్, మల్లయ్య,సిబ్బంది మురళి, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం రాజు, రాజశేఖర్, మోహన్, రమేశ్, ప్రభాకర్, దామోదరం, శ్రీనివాసులు, రామకృష్ణ, మునిరత్నం, గోపి కృష్ణ, నాగరాజు శెట్టి, హరి ప్రసాద్ లను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించి వారందరికీ నగదు రివార్డులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు.

# అన్ని ఉంటే అభ్యంతరం:చేయి తడిపితే రైట్ రైట్

### ఇల్లు ఒక చోట సర్వే నెంబర్ మరో చోట
### రెవెన్యూ సర్టిఫికేట్ల మాయాజాలం:
### సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు వరం

తొట్టంబేడు,ఏప్రిల్12 ప్రభాతవార్త

తొట్టంబేడు రెవెన్యూ కార్యాలయంలో విచ్చల విడిగా పోజీషియన్ సర్టిఫికేట్లు జారి అవుతున్నట్లు గుప్పు మంది,ఈ సర్టిఫికేట్ల ఆధారంగా సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరిగిపోతాయి. విద్యుత్ కనెక్షన్లు వచ్చేస్తాయి.పంచాయతీలో పన్నులు విధించబడతాయి. తొట్టంబేడు మండలం శ్రీకాళహస్తికి చేరువలో ఉంది. పొలిమేరల్లోని స్థలాలకు పక్కనే ఉన్న గ్రామకంఠం సర్వే నెంబర్‌తో పోజిషియన్ సర్టిఫికేట్లను జారి చేస్తున్నట్లు సమాచారం. ఉదాహరణకు రాజీవ్ నగర్ జిల్లా కలెక్టర్ లాగిన్ లో ఉంది. అయితే ఎవరి లాగిన్‌లో ఉంటే మాకేంటి? మా చేతి వాటం మాకు తెలుసు. రాజీవ్‌నగర్‌లో ఇల్లు ఉంటే పక్కనే గల చిట్టత్తూరు పంచాయతీలోని సర్వే నెంబర్‌తో పోజిషియన్ సర్టిఫికేట్‌ను జారి చేస్తారు. దీని ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ రెవెన్యూ సర్టిఫికేట్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసి చేతులు దులుపుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

అన్ని ఉంటే సవాలక్ష అభ్యంతరాలు. . . నకిలీలకు అయితే వెంటనే . . .



సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాల పని తీరు కూడా రోజు రోజుకు తీసి కట్టుగా మారుతుంది. అన్ని సక్రమంగా ఉంటే చూస్తాంలే పరిశీలిస్తాంలే. సర్వే నెంబర్ ఉందా? ఉంటే దానికి సంబందించి స్కెచ్ ఉందా? దానికి సర్వేయర్ సంతకం పెట్టారా? డిట కౌంటర్ సంతకం పెట్టారా? అని నెలల తరబడి తిప్పుకునే సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాధికారులు 'పోజిషన్ సర్టిఫికేట్' ఒకటి ఉంటే చాలు ఇక ఆ ఫైల్ ఆఘమేఘాల మీద పరుగులు తీస్తుంది. కారణం దీనికి ఏ సీటుకు ఎంత రేటో అంతరేటు అప్పనంగా అందుతుంది. సరైన రికార్డులుంటే తమకు వచ్చే ఆదాయం అంతంత మాత్రమే.కానీ రెవెన్యూ శాఖ జారి చేసే పోజిషన్ సర్టిఫికేటుతో రిజిస్టర్ చేస్తే కరెన్సి లక్షల్లో అందుతుంది. ఈ సర్టిఫికేట్ల వాపారం తొట్టంబేడు మండలంలో జోరుగా సాగుతున్నట్లు గుప్పు మంటుంది. ముఖ్యంగా రాజీవ్‌నగర్‌లో రిజిస్ట్రేన్లు అన్ని చిట్టత్తూరు,శివనాధపురం సర్వే నెంబర్లతో సాగుతున్నట్లు సమాచారం. ఇలా అయితే రాజీవ్‌నగర్‌లో అక్రమాలను ఎలా అరికట్టగలరు?

# వ్యర్థాలకు నిలయంగా స్వర్ణముఖి...?

### ప్రమాదస్థితికి చేరుకుంటున్న నది



తిరుపతిరూరల్, ఏప్రిల్12 ప్రభాతవార్త

తిరుపతిరూరల్ మండలంలో ఒకప్పుడు ప్రశాంతంగా ప్రవహించిన స్వర్ణముఖి నది ప్రస్తుతం మానవ నిర్లక్ష్యానికి బలైపోతూ ప్రమాదస్థితికి చేరుకుంది. డ్రైనేజ్ వ్యర్థాలు నిర్బంధం లేకుండా నదిలో కలుస్తుండగా...మరోవైపు అక్రమ ఇసుక తవ్వకాలతో నది స్వరూపం పూర్తిగా మారిపోతుందని స్థానికులు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రవేట్ కళాశాలల వ్యర్థాలు, అపార్టుమెంట్ వ్యర్థాలన్ని స్వర్ణముఖిలోకి వదిలేసి సునాయాసంగా చేతులు కడిగేసుకొంటున్నారు. స్వర్ణముఖిలో ప్రతిరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తూ....లక్షల్లో ఆర్జిస్తున్నారు. జెసిబిల సాయంతో ఇసుకను తవ్వేస్తున్నారు. ఈ తవ్వకాల వలన నదిలో ఏర్పడిన లోతైన గుంతలు ప్రాణాంతకంగా మారాయి. గత సంవత్సరం ఇదే కారణంగా నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటన ప్రజలను కలిచివేసింది. అప్పటికి ఇప్పటికి ఇదే పరిస్థితి కొనసాగుతుండటం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. స్వర్ణముఖి నదిని పునరుద్దరిస్తామని, పూర్తిస్థాయిలో శుద్ధి చేస్తామని ప్రకటించిన తుడ చైర్మెన్..ఆ దిశగా అడుగులు పడటం లేదనే విమర్శలు వస్తున్నాయి. స్వర్ణముఖి పరివాహక ప్రాంతాన్ని డ్రోన్ సర్వే నిర్వహించామని, అక్రమ నిర్మాణాలను గుర్తించి తొలగించి..పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని తుడ చైర్మెన్, అధికారులు ప్రకటించినప్పటికి ఇంతవరకు కార్యరూపం దాల్చలేదనే విమర్శలు ఉన్నాయి. స్వర్ణముఖి మరోపక్క ఆక్రమణకు గురైతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదిలో పెద్ద పెద్ద రాళ్లు వేసి, ప్రవాహాన్ని అడ్డుకోవడం, పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్ల స్వర్ణముఖి సహజ స్వరూపం నశిస్తోంది. ప్రస్తుతం స్వర్ణముఖి నది కాలుష్యంతో పాటు ప్రమాదకర గుంతలతో మరణ మృదంగం లా మారిపోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి వనరులు దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని కోరుతున్నారు. డ్రైనేజ్ వ్యర్థాలను నదిలో కలపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదకర గుంతలను పూడ్చి భద్రత కల్పించాలని కోరుతున్నారు. నదిని పూడ్చి...అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతున్నారు. స్వర్ణముఖి నది ప్రక్షాళనకు స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. "స్వర్ణముఖిని పున ర్జీవింపజేస్తాం" అన్న హామీ నిజమవుతుందా? లేక అది కూడా నీటి మీద రాతగా మిగిలిపోతుందా? అన్నది ఇప్పుడు అధికారుల చర్యలపై ఆధారపడి ఉంది.

# సాలె కులస్తుల అభివృద్ధికి సిఎం చంద్రబాబు కృషి

## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త




సాలెకులస్తుల అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఆదివారం తుమ్మిశికొత్తూరు రోడ్డు సమీపంలో జిల్లా సాలెకుల (ఒబిసి) సంక్షేమాభివృద్ధి సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసమావేశంకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. సంఘాల అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధి కూడా అవుతుందన్నారు. కాగా అసంపూర్తిగా ఉన్న సంఘ భవన నిర్మాణంకు నలభై లక్షలు వ్యయం అవుతుందని కోశాధికారి గోవిందరాజులు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్‌కు తెలిపారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు జనార్ధనరెడ్డి, చంద్ర, రాజేంద్ర, సిఐ మల్లేష్ యాదవ్, సంఘ నేతలు గోవిందరాజులు, రాధాకృష్ణ, వసంత్‌కుమార్, జిల్లా నలుమూలలనుంచి సాలె కులస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## వాకర్స్ కు మజ్జిగ పంపిణీ



తిరుపతి,ఏప్రిల్ 12పభాతవార్త: వాకర్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వాకర్స్ కు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీనివాసులు పాల్గొని 500 మందికి మజ్జిగను పంపిణీ చేశారు. వేసవి తాపానికి మజ్జిగ ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ నడకను ప్రారంభించి తమ ఆరోగ్య పరిరక్షణ కాపాడుకోవాలని సూచించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులచే వినాయక సాగర్ పార్క్ లోని చిన్నపిల్లల ఆడుకునే ఆట వస్తువులు మరమ్మత్తులకు గురి అయ్యాయని తెలుసుకొని తర్వాత వెంటనే మరమ్మత్తులు చేయమని అధికారులకు ఆదేశించారు. వాకర్స్ అసోసియేషన్ నాయకులను ఎమ్మెల్యే సన్మానించారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ ,సాంబశివారెడ్డి,, బాలాజీ, కృష్ణమూర్తి, సి ఎస్. రామస్వామి, శాంతి , సోమేశ్వర్ , యోగా మాస్టర్ వెంకటేశ్వర్లు, సాయి బాబా రెడ్డి, వెంకటేశ్వర రాజు, శంకర్ నాయుడు కూటమి నాయకులు రత్నం, ఆల్వార్ మురళి, యువరాజు రెడ్డి, దూది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

### -కమిషనర్ మౌర్య



తిరుపతి,ఏప్రిల్ 12పభాతవార్త: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 08772227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కమిషనర్ కోరారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి,ఏప్రిల్ 12పభాతవార్త: తిరుపతి ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిదిజిల్లాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యా హ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి కార్యక్రమం" నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ సిఎండి సిఎండి శివశంకర్ లోతేటి స్వయంగా పాల్గొని విని యోగదారుల సమస్యలపై పరిష్కారం చూపు తారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

## బ్రాహ్మణ సమాజంపై దాడులు ఆపాలి

### బ్రాహ్మణ సంఘం నేత వేదం హరిప్రసాద్



తిరుపతి హెల్త్,, ఏప్రిల్ 12 ప్రభాతవార్త : సమాజంలో కులాల మధ్య చిచ్చు పెడుతూ...రాజకీయ ఉనికి చాటుకోవాలనే తాపత్రయంతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు మంద కృష్ణమాదిగ బ్రాహ్మణ సమాజంపై చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ తెలిపారు. విద్వేష భావజాలాన్ని ప్రచారం చేస్తూ సమాజాన్ని విడగొట్టాలని ప్రయత్నించడం దారుణమైన విషయమని పేర్కొన్నారు. ఆదివారం బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య నాయకులతో కలిసి తిరుపతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో కుల, మత తారతమ్యం లేకుండా అన్ని రంగాల్లోనూ అందరూ కలిసి మెలిసి నడుస్తున్న తరుణంలో బ్రాహ్మణ జాతిని టార్గెట్ చేస్తూ మాట్లాడడం సమాజానికి హాని చేయడమేనని తెలిపారు. కృష్ణమాదిగ తన వ్యక్తిగత పబ్లిసిటీ కోసం ఎవరూ మనల్ని ఏమీ చేయలేరనే దురహంకారంతో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలకు వెన్నెముకగా నిలిచిన బ్రాహ్మణ జాతిని అకారణంగా దూషించడం అజ్ఞానానికి పరాకాష్టగా భావిస్తూ, అతని వ్యాఖ్యలను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుపెట్టుకుని ఒక సామాజిక వర్గంపై ద్వేషాన్ని నూరిపోయడాన్ని విద్వేషపూరిత ప్రసంగాలుగా (హేట్ స్పీచ్) పరిగణించి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణులపై ముఖ్యంగా దేవాలయ అర్చకులపై జరుగుతున్న వరుస దాడులు అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలోని 120 ఏళ్ల చరిత్ర కలిగిన బోడెమ్మ సత్రాన్ని కబ్జా చేయాలనే ప్రయత్నం, భైరవకోన పూజారిపై కత్తితో దాడి, కాకినాడ - తాళ్లరేవు మండలంలో చొర్లపేటలని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజారి సుందర సీతారామయ్య శర్మపై దాడులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

### బ్రాహ్మణులకు రిజర్వేషన్ కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సమాజం పట్ల చూపిస్తున్న ఉదాశీనతను ఎండగడుతున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో బ్రాహ్మణులకు పూర్తి రక్షణ, న్యాయం జరగడం లేదన్నారు. బ్రాహ్మణులకు రిజర్వేషన్ కల్పించాలని, అర్చకులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, అర్చకులకు, దేవాలయ ఆస్తుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, మందకృష్ణ మాదిగ బ్రాహ్మణులకు కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరిచుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని, దానిని ప్రజాస్వామ్య పద్ధతిలో చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. సమావేశంలో బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి కొత్తపల్లి విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముకుందాపురం మహేష్, సంయుక్త కార్యదర్శి రెడ్డి ప్రకాష్, రేణిగుంట బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు వి.కృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ లక్ష్మీ రమేష్, జిల్లా అధికార ప్రతినిధి కె.బాలాజీ శర్మ, సంయుక్త కార్యదర్శి బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డులో ఎంఆర్ఎఫ్ సెంటర్ ఏర్పాటు

### - కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల తో కుప్పం లో ఆరు ఎకరాల్లో ఉన్న డంపింగ్ యార్డును శుభ్రపరచి అక్కడే వస్తువుల పునరుద్ధరీకరణ కేంద్రం(ఎంఆర్ఎఫ్) కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను రఘు హ్యామ్ సైన్స్ అనే సంస్థ ద్వారా ఎరువుగా, ప్లాస్టిక్ ఇతర ప్రమాదకర చెత్తలను విభజించే పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయనుందని చెప్పారు. ఈ ఎరువును అవసరమైన రైతులు ట్రాక్టర్ల సాయంతో పొలాలకు తీసుకెళ్లవచ్చన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రజలు చెత్తను తడి,పొడి, ప్రమాదకర చెత్తలను వేరుచేసి అందిస్తే దాన్ని రోజువారీ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టంకు తరలించడం జరుగుతుందన్నారు. ఇందుకు అవసరమైన యంత్రాల కోసం ఐటిసి సంస్థ కార్పోరేట్ సంస్థల సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)కింద కోటి రూపాయలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే త్వరలో కృష్ణదాసనపల్లి వద్ద ఏర్పాటయ్యే కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌కు తడిచెత్తను తరలించడం జరుగుతుందన్నారు.

## అభ్యాసోత్సవం 2026లో బృందావన్ విద్యార్థుల విశేష ప్రతిభ




చిత్తూరురూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: చిత్తూరుపట్టణం, సంతపేట నాగాలమ్మ గుడి సమీపంలో వున్న బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాల విద్యార్థులు ఇఅబ్యాస్ అకాడమీ ఆద్వర్యంలో గుంటూరు మెడికల్ కాలేజి నందు నిర్వహించిన 12వ అభ్యాసోత్సవ 2026 కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరచారని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజకుమారి, డైరెక్టరు ప్రియతేజలు తెలిపారు. విద్యార్థులకు ఏపి సిఇవో సాయిరా,ం తెలంగాణ సిఇవో మణికంఠం, హానరీ అడ్వైజర్ డా. సతీష్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు కృష్ణదేవరాయులు, ఏపి నేషనల్ గ్రీన్ క్రాఫ్ట్స్ డైరెక్టరు సరస్వతి, గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా. ఎన్‌వి సుందరాచార్యలు మెరిట్ సర్టిఫికేట్స్ అందజేసారన్నారు. ఈ కార్యక్రమంలో బహుమతి సాధించిన పాఠశాల విద్యార్థులు, ఐఐటి పాఠ్యాంశాలనే బోధించే ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఐఏఎస్ విజయ్ కుమార్ పై అనుచిత వాక్యాలు మంచిది కాదు.



చిత్తూర్ హెల్త్ ,ఏప్రిల్ 11, ప్రభాత వార్త; మాజీ సీనియర్ ఐఏఎస్ అధికారి విజయకుమార్ ని అగౌరవంగా మాట్లాడడం మంచిది కాదని దళిత నాయకుడు, అవార్డు స్వచ్ఛంద సంస్థ అధినేత కె. రవికుమార్ తెలిపారు. సమాజంలో ఎటువంటి మత విద్వేషాలు లేకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రజా ప్రతినిధులే సమాజంలో విద్వేషాలు సృష్టిస్తూ అగాధాలు పెంచడం రఘురామకృష్ణ రాజుకి తగదని అన్నారు. ప్రకాశం జిల్లాలో మంచి అక్షరాస్యత పెంపులో కీలక పాత్ర పోషించి రాష్ట్రపతి అవార్డు పొందిన విశిష్ట అధికారిగా విజయ్ కుమార్ కు మంచి పేరు ఉంది అన్నారు. అదేవిధంగా ప్రస్తుత విధానంపై మాజీ ఐఎఎస్ విజయ్ కుమార్ సోషల్ మీడియాలో తన భావాలను తెలిపినట్లు తెలిపారు. రఘురామ కృష్ణంరాజు కూడా తన యొక్క భావవ్యక్తీకరణ ను సరళమైన భాషలో గౌరవప్రదమైనటువంటి విధానంలో చెప్పాలి కానీ అవమానకరంగా మాట్లాడడం మంచిది రవికుమార్ తెలిపారు

## ముగిసిన టైలరింగ్ శిక్షణ




యూనివర్సిటీ(తిరుపతి),ఏప్రిల్ 12పభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ,లైవ్లీహుడ్ బిజినెస్ ఇన్‌క్యూబేటర్ సంయుక్తంగా నిర్వహించిన మూడు నెలల టైలరింగ్ (అప్పారెల్ డిజైనింగ్) నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది.ఈ కార్యక్రమానికి మహిళా అధ్యయన కేంద్ర డైరెక్టర్,స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ సి. వాణి ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా విశ్వవిద్యాలయ విద్యార్థులు సిబ్బందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణ ద్వారా అనేక రకాల దుస్తుల తయారీ నైపుణ్యాలను అభ్యసించామని, ఇది తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. భవిష్యత్తులో స్వంత బుటిక్ స్థాపించాలని సంకల్పం వ్యక్తం చేశారు. .ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ , శిక్షణ కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ కె. హైమావతి, మాస్టర్ ట్రైనర్ పి. సునీత, శిక్షణ పొందిన ట్రైనీలు పాల్గొన్నారు.

## ఐపిఎల్ బెట్టింగ్, లాటరీలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు - ఎస్పీ

చిత్తూరురూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: ఐపిఎల్ బెట్టింగ్, లాటరీలు, జూదం కార్యక్రమాలపై రాజీపడని కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. ఆదివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ ప్రస్తుతం జరుగుతున్న ఐపిఎల్ సీజన్ నేపథ్యంలో అక్రమ బెట్టింగ్, లాటరీలు, జూద కార్యకలాపాలు పెరగకుండా కట్టడి చేయాలని, వీటి నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఐపిఎల్ మ్యాచ్‌లను ఆధారంగా చేసుకొని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాల ద్వారా యువత తప్పుదారి పడుతున్నారనీ, ఈ తరహా అక్రమ కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీసే ప్రమాదం వున్నదని హెచ్చరించారు. బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయిన వ్యక్తులు దానినుండి బయటపడలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకొంటున్నాయని, జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్లు తమ పరిదిలోని అనుమానస్పద ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెంచాలని సూచించారు. ఎక్కడైనా అక్రమ బెట్టింగ్, జూదం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు లేదా చిత్తూరు పోలీస్ వాట్సఅప్ నెంబరు 9440900005 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## మామిడి తోటకు నిప్పు

బైరెడ్డిపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



బైరెడ్డిపల్లి మండలం దొంతిరాళ్లపల్లి సమీపంలోని భాస్కర్‌రెడ్డి అనే రైతు మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం మధ్యాహ్నం నిప్పు పెట్టడం జరిగినది. ఈ కాలిపోయిన మామిడి తోట వలన ఇంచుమించు 7 లక్షల రూపాయల వరకు నష్టం వాటిలిందని రైతు తెలియజేస్తున్నాడు. ఈ విషయమై బైరెడ్డిపల్లి మండల పోలీస్ వారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగినది.

## ఎఫ్ ఎస్ ఫౌండేషన్ స్కూల్‌ను ఎలిమెంటరీ స్కూల్‌గా మార్చండి

బైరెడ్డిపల్లి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం పంచాయతీ కేంద్రంలోని ఎఫ్ ఎస్ ఫౌండేషన్ స్కూల్‌గా ఉన్న,ఒకటి, రెండు తరగతులను, తెలుగు మీడియం ఒకటి,ఐదు తరగతుల వరకు బేసిక్ ప్రైమరీ స్కూల్ గా కొనసాగించాలని, గ్రామస్తులు, గ్రామ పెద్దలు,పాఠశాల కమిటీ ఛైర్మన్,కమిటీ సభ్యులు, విద్యాశాఖ అధికారి జనార్ధన రెడ్డికి విన్నవించుకోవడం జరిగినది.ఈ సందర్భంగా మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ,మీ విన్నపాన్ని పైఅధికారులకు తెలియజేసి, తప్పకుండా ఐదవ తరగతి వరకు ప్రైమరీ స్కూల్ కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగినది.

## వీర్నమలలో పోలీసులు పల్లెనిద్ర

రామకుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త




మండల పరిధిలోని వీర్లమల గ్రామ పంచాయతీలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట మోహన్ మాట్లాడుతూ గంజాయి సారాయి, ఇతర మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలపై వేధింపులు, దాడులు, అత్యాచారాలు, అక్రమ రవాణా, దొంగతనాలు తదితర వాటిపై దూరంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు ప్రజలు పరస్పర సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాండియన్, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనదారులకు హెల్మెట్లు తప్పనిసరి

రామకుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



వాహనదారులకు రోడ్డు భద్రత ,హెల్మెట్లు తప్పనిసరిగా ధరించుకోవాలని ఎస్సై వెంకట మోహన్ వాహనదారులకు సూచించారు. ఇటీవల సమాజంలో హెల్మెట్ ధరించుకోక ప్రాణాలు కోల్పోతు కుటుంబ పోషణకు అధిక భారం పెడుతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు అధిక జరిమానాలు, జైలుకు పంపుతామని హెచ్చరించారు. వాహనాల రికార్డులు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పైపాళ్యంలో 72లక్షలతో భూగర్భ డ్రైనేజ్ నిర్మాణం

కుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



మండలంలోని పైపాళ్యం గ్రామంలో 72లక్షల వ్యయంతో నూతనంగా భూగర్భ డ్రైనేజ్ నిర్మాణ పనులను టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు సూచనలతో మండలంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమకు మేలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, మాజీ సర్పంచులు సికె మణి, వల్లెప్ప, యువనేత సికె విజయ్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, రెస్కో డైరెక్టర్ మురళి, నేతలు గోవిందరాజులు, జయరాం, తీర్థగిరి, భరణి, ఎఇ మధు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతికి ఏర్పాట్లు

కుప్పం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



రాజ్యాంగ నిరా ్మత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి బుధవారం జరగనుంది. కుప ్పంలో ఈసారి అంబేద్కర్ జయంతిని భారీ ఎత్తున నిర్వహించనున్నారు. బస్టాండులో బహిరంగసభ సైతం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం కడ సభ్యుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, మాజీ సర్పంచులు డాక్టర్ వెంకటేష్, ఎల్లప్ప, యువనేత మణియాదవ్ తదితరులు కుప్పం బస్టాండు ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు.

## డిఎస్పీగా పదవీబాధ్యతలు చేపట్టిన వెంకటనారాయణ

చిత్తూరురూరల్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



చిత్తూరు సబ్‌డివిజన్ డిఎస్పీగా జె.వెంకటనారాయణ ఆదివారం సబ్‌డివిజన్ కార్యాలయంలో పదవీబాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీలలో తిరుపతి జిల్లా ఎస్‌బి డిఎస్పీగా పనిచేస్తున్న వెంకటనారాయణ చిత్తూరు సబ్‌డివిజన్ డిఎస్పీగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సబ్‌డివిజన్ పోలీసు అధికారులు డిఎస్పీని మర్యాదపూర్వంగా కలసి అభినందించారు.

# ప్రతి డివిజన్‌లో జనసేన జెండా.. ఇక వెనక్కి తగ్గేది లేదు!

తిరుపతి విద్య ఏప్రిల్ 12 ప్రభాత వార్త



కార్పొరేషన్ రాజకీయాల్లో తన పట్టు బలపరచడానికి జనసేన పార్టీ దూకుడు పెంచింది. జీవకోనలోని పార్వతి నగర్‌లో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఈ దిశగా కీలక సంకేతాలిచ్చింది. ఎమ్మెల్యే

### సభ్యత్వ జోష్‌తో కేడర్‌కు ఫుల్ ఛార్జ్ - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఆరణి శ్రీనివాసులు స్వయంగా రంగంలోకి దిగడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపైంది. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు స్పష్టంగా హెచ్చరిక జారీ చేస్తూ, "ప్రతి డివిజన్‌లో జనసేన జెండా ఎగరాల్సిందే.. ఎక్కడా ఖాళీ ఉండదు" అని ప్రకటించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వడమే లక్ష్యమని, కేడర్ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీకి కొత్త ఊపిరి పోస్తోందని ఆయన తెలిపారు. భారీ స్థాయిలో యువత, కార్యకర్తలు జనసేన వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు.

ఇంకా సభ్యత్వం తీసుకోని వారు ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు కావాలని కఠినంగా సూచించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ కూడా కేడర్‌ను అలర్ట్ చేస్తూ, పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి.. ప్రతి కార్యకర్త ఫీల్డ్‌లో యాక్టివ్‌గా ఉండాలి అని పిలుపునిచ్చారు. ఆరణి శ్రీనివాసులు నాయకత్వంలో తిరుపతిలో జనసేన శక్తిని నిరూపిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు రాజారెడ్డి, వీర, సురేష్, మోహన్ కృష్ణ, ఈశ్వరయ్య, యాకసి, ఈసు, మూర్తి, రాజేష్ ఆచ్చారి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి ఉపయోగపడే సేవలతో జన్మదినం

### వీల్‌చైర్ల పంపిణీ.. రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహణ

తిరుపతి విద్య, ఏప్రిల్ 12 ప్రభాత వార్త




గీతం విద్యా సంస్థల అధినేత డా. తమ్మినేని వెంకటేశ్వర్లు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా చేపట్టిన ఈ కార్యక్రమాలు సేవా స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తిరుపతిలోని రుయా ఆసుపత్రికి అవసరమైన వీల్‌చైర్లు పంపిణీ చేశారు. రోగుల సౌకర్యార్థం వీటిని అందించడం పట్ల ఆసుపత్రి సిబ్బంది, రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనేక మంది యువకులు, సేవాభావం కలిగిన దాతలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమయ్యే రోగులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పేదవారికి అవసరమైన వారికి ఆహారాన్ని పంపిణీ చేసి మానవతా విలువలను చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, జన్మదినాన్ని కేవలం సంబరాలకే పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవడం అవసరమని తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలు డా. డా. తమ్మినేని వెంకటేశ్వర్లు సేవాభావాన్ని ప్రతిబింబిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచాయి. కార్యక్రమంలో పాల్గొన్న రక్తదాతలు, వాలంటీర్లు, నిర్వాహకులకు సంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మునస్వామి యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి

### టీడీపీ నాయకుల ర్యాలీ

కేవీబీ పురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:





తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, సత్యవేడు నియోజకవర్గ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కేవీబీ పురంకు చెందిన టీడీపీ నాయకుడు మునస్వామి యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి కేవీబీ పురం మండలం నుంచి 40 వాహనాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పసుపు చొక్కాలు, పసుపు జెండాలు ధరించి పార్టీ అధ్యక్షుని ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం మునస్వామి యాదవ్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలు పార్టీ నాయకులు, ఐక్యత భావం చూపాలని తెలిపారు. కార్యకర్తల సహకారంతో తెలుగుదేశం పార్టీని పూర్వ వైభవం తీసుకొస్తానని, తెలుగుదేశం పార్టీని నియోజకవర్గంలోని కేవీబీ పురం మండలాన్ని పార్టీ పరంగా ముందంజలో అభివృద్ధి తీసుకొస్తానన్నారు. అనంతరం దాసుకుప్పం నుంచి వాహనాల్లో భారీ ర్యాలీగా నూతన మండల అధ్యక్షులతో కలసి సత్యవేడు చేరుకున్నారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన సత్యవేడు నియోజకవర్గాన్ని నూతన మండల అధ్యక్షులతో కలసి పార్టీ బలోపేతానికి అందరం కలసి పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, సీనియర్ నేతలు, వేలాదిమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## 18న ఏపిటిఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలి!

### సమావేశం తీర్మానం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త




ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 18 ఆందోళనకు రాష్ట్ర కమిటి నిర్ణయించిందని ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆదివారం జరిగిన శ్రీకాళహస్తి ఎపిటిఎఫ్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. శ్రీకాళహస్తిలోని ఎపిటిఎఫ్ ఫెడరేషన్ కార్యాలయంలో జిల్లా సబ్‌కమిటి సమావేశం అధ్యక్షులు ఎస్ వెంకటముని అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి బి.మురళీకృష్ణ రాష్ట్ర కమిటి పిలుపుకు సంబంధించి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి మొరెబెట్టుకుంటూనే ఉన్నామని తెలిపారు. అయితే ప్రభుత్వం ఎందుకో పట్టించుకోవటం లేదని అసంతృప్తి వ్యక్తం చేసారు. ఉపాధ్యాయులకు అన్ని బాధ్యతల్ని అప్పగిస్తున్నారని అయితే వారి న్యాయమైన కొర్కెల విషయంలో ప్రభుత్వం, పాలకులు పట్టించుకోవటం లేదన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించి నివేదిక తీసుకొని నిర్ణయం తీసుకోవాలని, 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, పెండింగ్ డిఏలను ప్రభుత్వం చెల్లించాలన్నవి ప్రధాన డిమాండ్లుగా వివరించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర కమిటి క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాత దశల వారి ఆందోళనలకు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18 తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించుటకు నిర్ణయించినట్లు తెలిపారు. కమిటిలోని బాధ్యులు వారివారి పరిధిలో ధర్నా విజయంతం చేయటానికి ఉపాధ్యాయుల్ని సమీకరించాలని మురళీ కృష్ణ సూచించారు. సమావేశంలో ఎస్ వెంకటముని, మురళీకృష్ణ, ఇ.రామసుబ్బయ్య, వై.మల్లికార్జున్, డాక్టర్ రాజేష్ ఆనంద్, ఏ భువనేశ్వరి, ఎస్‌కె చెంచురాజు,, టి సురేష్, సెల్వం పూర్వ ఆడిట్ కమిటి సభ్యులు జి.సుధాకర్, ఈ మురళి పాల్గొన్నారు.

## దివ్యాంగులను ప్రేమతో ఆధరించండి

రామచంద్రాపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



దివ్యాంగులను ప్రేమతో ఆధరించాలని బ్రాహ్మణపట్టు విఆర్‌ఓ మురళీబాబు అన్నారు. ఆదివారం తన కుమార్తె తీక్షిత పుట్టిన రోజు వేడుకలను అక్షయ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ పిల్లల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను మానవతా దృక్పథంతో ఆధరించి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## అనుప్పల్లిలో వైభవంగా శ్రీసీతారాముల కళ్యాణం

రామచంద్రాపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని అనుప్పల్లిలో ఆదివారం శ్రీసీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాములవారి ఆలయాన్ని పచ్చని పందిళ్ళు, మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. శ్రీసీతారామ లక్ష్మణ హనుమంత ఉత్సవ మూర్తులను వివాహ పీఠంపై ప్రతిష్టింపజేసి వేదమంత్రోచ్చారణల నడుమ కళ్యాణోత్సవ తంతు నిర్వహించారు. ఈ కళ్యాణానికి వేపనూరు భాస్కర్, విజయలక్ష్మి దంపతులు ఉభదారులుగా వ్యవహరించారు. రాములవారి కళ్యాణోత్సవాన్ని తిలకించడానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి, పసుపు కుంకుమలను పంపిణీ చేశారు.

## చిన్నారుల తొలి అడుగు.. విజయానికి వేడుక

### నారాయణ పాఠశాలలో ఘనంగా కాన్వకేషన్

తిరుపతి విద్య, ఏప్రిల్ 12 ప్రభాత వార్త




స్థానిక ఎయిర్ బై పాస్ రోడ్డు న్యూఇందిరా నగర్‌లో ఉన్న నారాయణ పాఠశాలలో చిన్నారుల కాన్వకేషన్ వేడుకను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థుల జీవితంలో చిరస్మరణీయంగా నిలిచే ఈ కార్యక్రమం ఎంతో ప్రత్యేకంగా, ఆనందోత్సాహాల మధ్య సాగింది. చిన్నారులు గ్రాడ్యుయేషన్ గౌన్‌లు, క్యాప్‌లు ధరించి వేదికపై మెరిసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డి.జి.యం కొండలరావు మాట్లాడుతూ, పూర్వప్రాథమిక , ప్రాథమిక విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని తెలిపారు. చిన్న వయసులోనే మంచి విలువలు, నైతికత, క్రమశిక్షణ అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని ఆయన పేర్కొన్నారు. పిల్లలలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పాఠశాల ఏ.జి.యం ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ, ఆటపాటలతో కూడిన విద్య చిన్నారులలో ఆసక్తిని పెంచడంతో పాటు నేర్చుకునే ప్రక్రియను సులభతరం చేస్తుందని వివరించారు. సమగ్ర అభివృద్ధి కోసం విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. చిన్నారుల నృత్యాలు, పాటలు, వేషధారణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. తమ పిల్లల ప్రతిభను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్.ఐ వసంత్, ప్రిన్సిపాల్ హిందుజ, కోఆర్డినేటర్లు సుదర్శన్, దాక్షాయణి, వరలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్స్ లలిత, జోత్స్న తదితరులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంముగింపులో చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 16 ట్రస్టుబోర్డు సమావేశం?!

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశం ఈ నెల 16న ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత మహాశివరాత్రి సంబరాలు మొదలయ్యాయి. దాంతో శివరాత్రి ఏర్పాట్లు, చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు అంచనాలకే సరిపోయింది. సమావేశంలో శాసనసభ్యుడు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులకు సూచించటం జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయ చరిత్రలో లేని విధంగా ఇటీవల జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రూ. 6కోట్ల బడ్జెట్‌తో నిర్వహించారు. ఈ పనులకు సంబంధించిన అంశాలను చెల్లింపులకు సంబంధించి ధర్మకర్తల మండలి అమోదం తెలపాల్సి ఉంటుంది. అయితే శివరాత్రి ఏర్పాట్లుకు ముందే ధర్మకర్తల మండలి ఉంది కాబట్టి ఆమోదాలు మమ అనిపించటమే అవుతుంది. ఈ నెల 16న శాసనసభ్యులు

# శివభక్తులకు మరో సాంకేతిక సేవ

### కొట్టెసాయి ప్రసాద్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే వేలాది మంది భక్తులకు మరో సాంకేతిక సేవను అందిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సేవలకు సంబంధించి చైర్మెన్ సాయి ప్రసాద్ భక్తులతో ముఖాముఖి నిర్వహించారు. ప్రస్తుతం శ్రీకాళహస్తీశ్వరాలయంలో అన్ని సేవలకు సంబంధించిన టిక్కెట్లును విక్రయించుటకు ఒరెండవ గోపురం వద్ద సెంట్రైజ్డ్ కౌంటర్లు ఏర్పాటు చేసారు. మొదట ఒక్కొక్క సేవకు ఒక్కొక్క టిక్కెట్టు కౌంటర్‌ను ఏర్పాటు చేసామని అయితే దీని వల్ల భక్తులు ఇబ్బందులు ఎ దుర్కొంటున్న దృష్ట్యా భక్తుడు ఏ కౌంటర్లో అయినా తనకు కావాల్సిన టిక్కెట్లును కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అయితే ఇంకొంత ముందుకు వెళ్ళి భక్తులు కౌంటర్ దగ్గరకు వెళ్ళటం అక్కడ క్యూలైన్లో నిరీక్షించటం లాంటి సమయం వృదాకు సంబంధించి అధ్యయనం చేసిన తరువాత ప్రస్తుతం టెంపుల్ టిక్కెట్లు వెండింగ్ మెషిన్(టిటివిఎం)ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన యంత్రాలను ఆలయంలోని పరిపాలనా భవనాలు, త్రినేత్ర అతిధి గహాల వద్ద ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ యంత్రాల ద్వారా భక్తులు తమకు కావాల్సిన సేవకు సంబంధించినమోదు చేస్తే చాలునన్నారు. టచ్ స్క్రిన్ మీద టచ్ చేస్తే భక్తులకు దర్శనం టిక్కెట్టునా? లేక ఏ రకమైన సేవా టిక్కెట్లు లేదా రాహుకేతుదోష నివారణ టిక్కెట్లు నగదు లేదా డిజిటల్ చెల్లింపుల ద్వారా ప్రింట్ తీసుకోచ్చునని వివరించారు.

దీనివల్ల ఆలయానికి వచ్చిన భక్తులకు దళారుల బాధ కొంత వరకు తగ్గుతుంది. ప్రస్తుతం ప్రయోగాత్మంగా దక్షిణ గోపురం ఎదురుగా ఏర్పాటు చేసామని దీనిని అన్నిగోపురాల ప్రవేశాల వద్ద ఏర్పాటుకు పరిశీలిస్తున్నట్లు చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ వివరించారు. ఈ యంత్రాల సేవతో భక్తులకు సమయం ఆదా అవుతుంది, భక్తులకు ఇష్టమొచ్చిన సేవా టిక్కెట్లును తీసుకునే అవకాశం ఉంటుందని చైర్మెన్ తెలిపారు. ఈమేరకు ఆయన యంత్రాల నుంచి టిక్కెట్లును సేకరించుకుంటున్న భక్తులతో అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

# తిరుపతి డివిజన్

## పాకాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

### - 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

పాకాల, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:



పాకాల మండలంలోని దామల చెరువు రాజీవ్ కాలనీ పరిధిలో పోలీసులు తెల్లవారు జామున విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, చంద్రగిరి ఎస్డీపీఓ బేతపూడి ప్రసాద్ సూచనలతో పాకాల ఇన్స్పెక్టర్ టి. చిన్న గోవిందు ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు ఈ ఆపరేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాకరపేట సీఐ, పాకాల సీఐ టి.చిన్న గోవిందు, పాకాల ఎస్ఐ తరుణ్, బాకరపేట ఎస్ఐలతో పాటు మొత్తం 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్ సందర్భంగా సుమారు 250 గృహాలను తనిఖీ చేయగా, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 6 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు వాహనాలకు సంబంధించిన చట్టపరమైన పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

## ఎట్టకేలకు కదిలిన రైల్వే యంత్రాంగం!

### వార్తకు స్పందన:



పాకాల, ఏప్రిల్ 12, ప్రభాతవార్త:

పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పరిధిలోని కుక్కలపల్లి సమీపంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద నెలకొన్న రహదారి సమస్యపై ఎట్టకేలకు రైల్వే యంత్రాంగం స్పందించింది. గత రెండేళ్లుగా ఎస్ మలుపు వద్ద అధ్వానంగా మారిన రహదారి కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ సమస్యపై పత్రికల్లో నిరంతరం వరుస కథనాలు వెలువడడంతో రైల్వే శాఖపై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్న వాహనదారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో వార్తా పత్రిక కీలక పాత్ర పోషించింది. దీంతో స్పందించిన రైల్వే అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, రహదారిలో ఉన్న గుంతలను పూడ్చి, శాశ్వత రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసారు. దీంతో ఇప్పటివరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులకు ఉపశమనం కలిగింది. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన వార్తా పత్రికల కృషిని వారు కొనియాడుతున్నారు. ఇకపై ఇటువంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వార్షికోత్సవం

పాకాల, ఏప్రిల్ 12, ప్రభాతవార్త



పాకాల మండలం పెద్దగోర్పాడు గ్రామంలో ఘనంగా 16వ శ్రీరామనవమి వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు శ్రీరామనవమి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానిని పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేని ఆలయ మర్యాదలతో శాలువాతో సత్కరించి వేద పండితులు తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి ఉత్సవానికి విచ్చేసిన భక్తులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎమ్మెల్యేని వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపే సంక్షేమానికి భద్రత

### డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు

వరదయ్యపాలెం, ఏప్రిల్ 12, ప్రభాతవార్త

వేసవి కాలం మొదలైన వెంటనే విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. ఎయిర్ కండీషనర్లు, ఫ్యాన్లు, కూలర్లు వంటి ఉపకరణాలు ప్రతి ఇంట్లో అవసరంగా మారతాయి. అయితే ఈ వినియోగం పెరుగుదలతో పాటు బాధ్యతాయుతమైన వినియోగం కూడా అత్యంత అవసరం. ప్రస్తుతం అనేక సంక్షేమ పథకాలు విద్యుత్ వినియోగంతో అనుసంధానమై ఉన్నాయి. ముఖ్యంగా నెలకు 300 యూనిట్లు దాటితే, కొన్ని పథకాల లబ్ధి కోల్పోయే అవకాశం ఉందని డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు అన్నారు. అందువల్ల విద్యుత్ పొదుపు కేవలం ఖర్చు తగ్గింపుకే కాదు, సంక్షేమ ప్రయోజనాల రక్షణకూ కీలకం అన్నారు. విద్యుత్ పొదుపు ఇంటి నుంచే ప్రారంభం కావాలి. అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్ వినియోగించడం, ఏసీని సరైన ఉష్ణోగ్రత వద్ద వాడటం, ఉపయోగంలో లేని లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయడం, కుటుంబ సభ్యులందరిలో అవగాహన పెంపొందించడం వంటి చిన్న చిన్న అలవాట్లు పెద్ద మార్పుకు దారితీస్తాయన్నారు. ప్రతి యూనిట్ ను కాపాడుకుంటే అది కుటుంబానికి లాభమే కాకుండా సంక్షేమానికి దారితీస్తుంది. అలాగే, విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా దేశ స్థాయిలో కూడా శక్తి వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది తోడ్పడుతుంది. డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు పేర్కొన్నట్లుగా, ఆచి తూచి విద్యుత్ వినియోగిస్తేనే సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఇంటికీ చేరుతుంది. ఆయన సూచన ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాల్సినది. విద్యుత్ పొదుపు ఒక అలవాటు మాత్రమే కాదు అది ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ఈ వేసవిలోజాగ్రత్తగావిద్యుత్ వినియోగించి, మన కుటుంబ భవిష్యత్తును, సంక్షేమాన్ని కాపాడుకుందాం అన్నారు.

## "మరుగు"కై మగువల మానసిక క్షోభ

### చంద్రగిరిలో యధేచ్ఛగా బహిరంగ మూత్రవిసర్జన

### ఏళ్ళ తరబడి మూసివేతలో పంచాయతీ మరుగుదొడ్లు

చంద్రగిరి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరిలో మహిళలు మరుగు కోసం మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. చంద్రగిరి గ్రామ పంచాయతీలో పంచాయతీకి చెందిన మరుగుదొడ్లు ఏళ్ళ తరబడి మూసివేతకు గురికావడంతో గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్న ప్రయాణికులు, వారపు సంతకు వచ్చే వ్యాపారులు, బస్టాండ్‌లోని చిరు వ్యాపారులు మహిళలు, పురుషులు కనీసం మూత్ర విసర్జనకు మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చంద్రగిరిలో ఆదివారం మాత్రం వారపు సంత నిర్వహిస్తుండగా మిగిలిన రోజుల్లో సంత ఆవరణ కేవలం మూత్ర విసర్జనకు వినియోగిస్తున్నారు. వారపు సంతకు వస్తున్న వ్యాపారులు, స్థానికంగా తోపుడు బండ్లు, టీ అంగళ్ళు, చిరు దుకాణాలు నిర్వహిస్తున్న దాదాపు 200 మందికి పైగా మరుగుదొడ్లు లేకపోవడంతో పురుషులైనా, మహిళలైనా బహిరంగ ప్రదేశాలలో, ముళ్ళపొదల్లో, ఆటో స్టాండ్స్‌లో మూత్రవిసర్జనకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు అవమాన భారంతో మరుగు లేక వెళ్ళలేక రోగాలబారిన పడుతున్నారు. పురుషులైతే ఎక్కడపడితే అక్కడ మూత్రవిసర్జనకు పాల్పడుతున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇంటింటికీ మరుగుదొడ్లు మంజూరు చేస్తుండగా, మెరుగైన ఆదాయ వనరులు కలిగిన మేజర్ పంచాయతీ చంద్రగిరిలో ప్రజా మరుగుదొడ్లు లేకపోవడం అవమానకరం. అధికారులు ఇకనైనా ప్రజల మానసిక ఇబ్బందులను గుర్తుంచుకొని మూతపడిన మరుగుదొడ్లను ఆధునీకరించి పునఃప్రారంభించాలని సర్వత్రా కోరుతున్నారు.

# తహసిల్దార్ ఆదేశాలు ఉల్లంఘన

**- ప్రభుత్వ భూములు గుర్తించి సర్వే చేసిన ఆగని భూకబ్జాలు - రాత్రికి రాత్రే హద్దు రాళ్లు నాటి కంచి వేసిన ఆసాములు - నివేశన స్థలాలు లేక గుడారాల్లో దుర్భర బతుకులు - ప్రశ్నార్థకంగా మారిన గిరిజన ఇంటి స్థలాలు - అధికారులు, గిరిజన సంఘాలు చొరవ చూపాలంటున్న గిరిపుత్రులు**



చిట్టమూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: చిట్టమూరు మండలం అరవపాలెం పంచాయతీ పరిధిలోని చిన్న దరఖాస్తు గ్రామంలో మంద బైలు భూములుపై తహసిల్దార్ నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ కొంతమంది యదేచుగా కబ్జా చేస్తున్నారు. కాలనీలో ఎంతోకాలంగా నివేసిన స్థలాలు లేక గిరిజనులు చిన్నచిన్న గుడారాల ఏర్పరచుకొని దర్భర జీవితం గడుపుతున్న విషయం తెలిసిందే. గత నెల పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా తహసిల్దార్ రామయ్య, స్థానిక సర్పంచి నల్లారెడ్డి రాజేష్‌రెడ్డితో కలిసి అన్నిశాఖల అధికారులతో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ భూములైన మంద బైలు స్థలాలను గిరిజనులకు కేటాయించేందుకు సర్వే చేయించి విషాదాజ్ఞులు విధించారు. ఈ భూముల్లో ఎవరు ప్రవేశించరాదని తదుపరి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామంలో నివేసిన స్థలాలు లేని అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు కల్పించేందుకు వెసులుబాటు కలుగుతుందని ఆయన అన్నారు. ఇప్పటికే కొంతమంది భూములను ఆక్రమించి పంట సాగు చేపట్టడంతో పాటు శనివారం రాత్రి ఆసామి కొందర సహకారంతో భూమిని ఆక్రమించి చుట్టూ కంచి ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మరోమారు గిరిజనులు తహసిల్దారు తమకు చెప్పిన విధంగా స్పందించి తమకు ఇంటి స్థలాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

**- గిరి పుత్రుల సమస్యలు గిరిజన సంఘాలకు పట్టవా:**

గిరిజనుల సంక్షేమమే తమ సంక్షేమ అంటూ చెప్పుకుంటున్న గిరిజన సంఘాలు అనాదిగా గిరిజనులు ఎన్నో సమస్యలు ఆయా గ్రామాల్లో ఎదుర్కొన్నప్పటికీ పట్టించుకునేవారు లేరని చిన్న దరఖాస్తు గ్రామానికి చెందిన గిరిజనులు సందర్భంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎన్నో ఏళ్లగా కనీస మౌలిక సదుపాయాలకు దూరంగా గూడు లేక ఇబ్బందులు పడుతున్నామని వారు కన్నీరుగా వినిపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులతో పాటు గిరిజన సంఘ నేతల సైతం తమ సమస్యను గుర్తించి తమకు నివేసిన స్థలాలు ఇప్పించి పుణ్యం కట్టుకోవాలని వారు కోరుతున్నారు.

# రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం కమిటీ ప్రమాణస్వీకారం



తిరుపతి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: తిరుపతిలోని రేణిగుంటరోడ్‌లో ఓ కనెక్షన్ హాల్‌లో రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. అధ్యక్షుడిగా సిద్ధార్థ విద్యాసంస్థల యజమాని కొండూరు అశోక్ రాజు, జనరల్ సెక్రెటరీగా నారాయణ బాబు, కోశాధికారిగా శివరాజు, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ బలరామరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీరేంద్రవర్మ, ఆర్గనైజేషన్ సెక్రటరీగా కీర్తిపాటి రాధాకృష్ణ వర్మ, కార్యవర్గ సభ్యులు ఎన్నిక కావడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ, గత తిరుమల తిరుపతి దేవస్థానముల జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరాజు హజరయ్యారు. కార్యక్రమానికి తమిళనాడు, కర్ణాటకకు సంబంధించిన రాష్ట్రీయ క్షత్రియ సేవా సమితి సభ్యులందరూ కూడా హాజరు కావడం జరిగింది. తిరుపతిలో నూతనంగా నిర్మించిన క్షత్రి య భవన నిర్మాణం పూర్తికి సహకరిస్తూ పలువురు దాతలు విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కొండూరు అశోక్‌రాజు మాట్లాడుతూ పార్టీలకతీతం గా క్షత్రియ సంఘానికి సహాయ సహకారాలు అందించడానికి క్షత్రియ వంశంలో ఉన్నటువంటి పేదలు బడుగు బలహీన వర్గాలకు చేయూతను అందించడానికి సంఘం ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.

విద్యా వైద్యం ఉపాధి రంగాలలో కచ్చితంగా కొత్తగా ఎన్నికైన సంఘం క్షత్రియ బడుగు బలహీన వర్గాల్లో ఉన్న వారందరికీ వారి తోడ్పాటు అందించి కృషి చేయాలని మరొక ముఖ్యఅతిథిగా పాల్గొన్న గత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్, రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు లోకేష్ వర్మ తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ శాఖలో క్షత్రియ బ్రాహ్మణ వైశ్య కులాలు సంఘటితంగా ఏర్పాటు చేసుకున్నటువంటి సంఘం బలవపైతమవుతుందని, ఇతర అన్ని డిపార్ట్మెంట్లో కూడా ఉద్యోగులు అదే రీతిన సంఘం ఏర్పాటు చేసుకొని క్షత్రియ సంఘానికి క్షత్రియకుల వికాసానికి తోడ్పడాలని కార్యవర్గ సభ్యులు దొమ్మరాజు భాస్కర్ రాజు తెలిపారు. రాబోవు రోజుల్లో రాజకీయాలకు అతీతంగా క్షత్రియులు ప్రతి ఒక్కరు ఐక్యమత్యంతో ఏక వాక్య తీర్మానంతో ముందుకెళుతూ సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ముఖ్య అతిథి శ్రీనివాసరాజు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తరతమ భేదాలు లేకుండా అందరూ కృషి చేయాలని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

# టిడ్కో ఇళ్లు అందజేతకు సన్నాహాలు

**-రూ.500లు మినహా మిగిలిన ఇళ్లు సిద్ధం**



తొట్టంబేడు,ఏప్రిల్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పొలిమేరల్లో నిరుపేదల భాగస్వామ్యంతో గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు ఎంపిక చేసిన లబ్దిదారులకు ఈ నెల 15మాజీ మంత్రి, టిడ్కో ఇళ్ళ రూపకర్త బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జన్మదిన సందర్భంగా ఇళ్ళను అప్పగించుటకు మున్సిపల్, హౌసింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఇళ్ళను నిరుపేదల కలల సాకారానికి నాటి మంత్రి హోదాలో గోపాలకృష్ణారెడ్డి టోకెన్లు అందించిన మేరకు అందించాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పట్టుబట్టారు.ఉగాది నాటికి రూ.500ల డిపాజిట్ చేసిన వారికి మినహా మిగిలిన వారికి అందజేయటానికి సిద్ధం చేస్తున్నారు. గతంలో లబ్దిదారులకు పట్టాలు అందించారు. వాటి స్థానంలో పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇళ్ళను అందించుటకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ మంచినీటి సదుపాయం తప్ప మిగిలిన సదుపాయాల కల్పన పూర్తిఅయినట్లు సమాచారం. ఐదేళ్ళ వైకాపా పాలనలో ఎన్నో మార్పులు చేర్పులు చేసారు. జగనన్న కాలనీ పేరుతో టిడ్కోఇళ్ళకు చరమగీతం పాడారు. లబ్దిదారులకు సంబంధించిన ఇళ్ళను అప్పటి అధికార పార్టీ, అధికారులు పంచుకున్నారు. కూటమి వచ్చిన తరువాత చర్యలు మొదలయ్యాయి. శ్రీకాళహస్తికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో రాజీవ్‌నగర్,తొట్టంబేడు మండలం శివనాథపాళెం పరిధిలో టిడ్కో ఇళ్ళను నిర్మించారు. 2017 తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు ఇక్కడి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి లబ్దిదారులను ఎంపిక చేసారు. అప్పటిలోనే లబ్దిదారులను ఎంపిక చేసిన ఏ ఇల్లు ఎవరికి కేటాయించారో ప్రకటించారు. లబ్దిదారుల ఇళ్ళను పారదర్శకంగా లాటరీ పద్దతిలో ఎంపిక చేసారు.

**కూటమి వచ్చిన తరువాత పరుగులు:**

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి టిడ్కో ఇళ్ళకు సంబంధించి చొరవ చూపారు.అధికారులతో పలుమార్లు చర్చించారు. అలాగే ప్రభుత్వం దృష్టికి మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణతో చర్చించారు. కాంటాక్టు తీసుకున్న కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. పనులు పూర్తి చేయుటకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఏజెన్సికి చేదు అనుభవం ఎదురైంది. ఇక్కడ ఇళ్ళకు సంబంధించి ఏర్పాటు చేసిన కిటికీలు, విలువైన వస్తువులను దొంగతనానికి గురయ్యాయి. దాంతో కాంట్రాక్టర్ మీద అదనపు భారం పడింది. ఈ నేపధ్యంలో కొన్ని ఇళ్ళను కాంట్రాక్టర్ పూర్తి చేసాడు. ఉగాది నాటికి శివనాథపాళెం వద్ద ఉన్న 360 అడుగుల ఇళ్ళు 304, 400 చదరపు అడుగుల ఇళ్ళు 541 పూర్తి అయ్యాయి. ఇక ఫేస్ 2 రాజీవ్‌నగర్‌లో 1920 ఇళ్లు సిద్ధం చేసారు.

**కమిషనర్ వివరణ:**

టిడ్కో ఇళ్ళకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను వివరణ కోరగా ఈ నెల 15 నాటికి లబ్దిదారులకు అందించుటకు సర్వం సిద్ధం చేస్తున్న ట్లు వివరించారు. శాసనసభ్యులు టిడ్కో ఇళ్లను అందించాలని ఆదేశించారని ఆ నాటికి మంచినీటి సరఫరాకు కూడా అందించుటకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకున్నామని వివరించారు.

## ఆర్ఐ బదిలిలో ఆంతర్యమేమిటి?

తొట్టంబేడు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: తొట్టంబేడు మండల ఆర్ఐని కెవిబిపురం మండలానికి డెప్యూటేషన్ మీద పంపారు.ఆమె ఇక్కడ ఆర్ఐగా పని చేస్తుంటే కెవిబిపురానికి సీనియర్ అసిస్టెంట్‌గా డెప్యూటేషన్ పై వెళ్ళమంటూ ఆదేశాలు జారి అయ్యాయి. ఆమె ఇక్కడకు వచ్చిన 7 నెలల్లోనే డెప్యూటేషన్ మీద పంపటం గమనిస్తే వ్యవస్థలో రాజకీయ పలుకుబడి ఎలా పని చేస్తుందో అర్ధమౌతుంది. ఆర్ఐగా జీతం సీనియర్ అసిస్టెంట్‌గా పని చేయమనటం గమనిస్తే వ్యవస్థలు ఎలా పతనమౌతున్నాయో అర్ధమౌతుంది. ఆమెకు జనగణనకు బాధ్యతలు అప్పగించారు.అయినా డెప్యూటేషన్ పై వెళ్ళమంటే జనగణన బాధ్యతలు ఎవరు పర్యవేక్షిస్తారు.అయితే గత కొంత కాలంగా తహశీల్దార్,ఆర్ఐలు చక్కగా పని చేసే వారు.ఓ మహిళ ఉద్యోగిని ఏడు నెలల్లో డెప్యూటేషన్‌పై పంపటం ఎంత వరకు సమంజసం. కార్యాలయంలో డిటికి ఆర్ఐకి పొత్తుపొసగక పోవటంతో పరిపాలన గందరగోళంగా మారింది. ఒకే ఉత్తర్వుల్లో ఇద్దరు ఉద్యోగులకు డెప్యూటేషన్ ఉత్తర్వులు వచ్చాయి. రాత్రికి ఉత్తర్వులు వెలువడితే ఓ ఉద్యోగి ఏమో సెలవులో వెళ్ళటం మహిళా ఉద్యోగిని రాత్రికి రాత్రి వాట్స్‌ప్‌లో రిలీవింగ్ ఉత్తర్వులు పంపటంలో అంతర్యమేమిటి? అనేది చర్చనీయాంశంగా మారింది.తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల తీరు అస్తవ్యస్తంగా మారింది.ఇక ఇక్కడ డిటి ప్రతి రోజూ తిరుపతి నుంచి రావటం మరో టిస్టు.

## అవినీతి అధికారులకు కూటమి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి

**టిడిపి నేత, మాజీ టిటిడి బోర్డు సభ్యుడు ఓవీ రమణ**



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: కూటమి పాలనలో అవినీతి అధికారులకు అడ్డుకట్ట వేయాలని టిడిపి నేత, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు ఓవీ రమణ అన్నారు. ఆదివారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని కొందరు అధికారుల పెత్తనం ఇప్పటికి ఇంకా కొనసాగుతోందన్నారు. హౌసింగ్ శాఖలోని ఒక ఉన్నతాధికారి అవినీతికి తాను కూడా భాదితుడినన్నారు. రూ. 90 లక్షలు బిల్లు మంజూరు కొరకు లంచం ఇవ్వాల్సిందేనని ఆ అధికారి నా బిల్లు పక్కన పెట్టాడని.. ఆడవాళ్ళతో మాట్లాడి సెటిల్ చేసుకో మంటున్నాడని అయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం ప్రభుత్వం కోసం కాపు కాసిన వారికి అన్యాయం జరుగుతుందన్నారు. రానున్న 3 ఏళ్ళు కూటమి ప్రభుత్వం బాగుండాలని కోరుకుంటున్నాం. అయితే అలాంటి పరిస్థితి కనిపించడంలేదని, ప్రభుత్వానికి పాలనపై పట్టు లేదని స్పష్టం అవుతోందన్నారు. లంచం కోసం పాకులాడే అధికారులపై చర్యలెందుకు లేవని అయన ప్రశ్నించారు.. కమ్మగా భజన చేసే వారికి మాత్రమే ప్రభుత్వం కమ్మగా ఉందన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న వారిని బానిసలుగా కాకుండా నాయకులుగా చూడలని అయన కోరారు. 10 నెలలుగా బిల్లు రాలేదని పార్టీ పెద్దలకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, ఇలాంటి అధికారులపై సీఎం దృష్టి పెట్టాల్సిన అవసరముందన్నారు.

## న్యాయం చేయాలంటూ నిరాహార దీక్ష



చిట్వేలి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ కోసం పనిచేసి పోలీసుల అరెస్టులు ఎదుర్కొన్న నాకు ప్రస్తుతం తీవ్ర అన్యాయం జరుగుతుందని, న్యాయం చేయాలని స్థానిక మండల పరిధిలోని తిమ్మయ్యగారి పల్లి పంచాయతీ, చిల్లావాండ్లపల్లి టిడిపి పార్టీ బూత్ ఇన్చార్జ్ రామిశెట్టి నరసింహులు ఆవేదన వ్యక్తపరిచారు. ఆదివారం తన ఇంటి ముందు నిరాహార దీక్షకు పూనుకున్నారు. టిడిపి పార్టీకి ఎనలేని సేవ చేశానని, అది మరచి ప్రస్తుత రైల్వే కోడూరు టిడిపి బాధ్యుడు ముక్కా రూపానంద రెడ్డి తనపై కక్ష సాధింపు కొనసాగిస్తున్నారన్నారు. ఇన్చార్జిగా నియమించబడి రెండు సంవత్సరాలు కావస్తున్నా కనీసం మా సొంత గ్రామంలో మమ్మల్ని గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. సిమెంట్ రోడ్లను వైసిపి వారికి ఇవ్వడం, తన పొలానికి మంజూరు అయిన మట్టి రోడ్డును అధికారులకు చెప్పి రద్దు చేపించడం ఎంతవరకు న్యాయమని దుయ్యబట్టారు. నాకు జరిగిన అన్యాయానికి పార్టీ న్యాయం చేకూర్చకపోతే దీక్ష కొనసాగిస్తానని, ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని తెలియపరిచారు. విషయం తెలుసుకున్న మండల క్లస్టర్ ఇంచార్జ్ వెంకటేష్ రాజు, కో క్లస్టర్ కట్టా గిరిబాబు, యూనిట్ ఇంచార్జ్ బండారు శివ, చిట్వేలి గ్రామ పార్టీ అధ్యక్షులు పగడాల శివ, మద్దిన రంగయ్య, మన్నూరు వెంకటేష్, సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, లారీ సుబ్బారాయుడు తదితరులు వెళ్లి పార్టీ అందరికి న్యాయం చేస్తుందని, మీరు మీ దీక్ష విరమించాలని కోరినప్పటికీ.. నాకు న్యాయం జరిగే వరకూ దీక్ష పోరాటం ఆపేది లేదని కఠినంగా తెలిపారు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకొని నాకు న్యాయం చేయాలని బాధ్యుడు రామిశెట్టి నరసింహులు పాత్రికేయులకు తెలిపారు.

# ఇదేమి పాడు బుద్ధి.... సారూ...!

**సమగ్ర శిక్షలో మహిళకు వేధింపులు-జిల్లా విద్యాశాఖలో కలకలం రేపిన ఘటన వేధింపులు భరించ లేనట్టు మహిళ కన్నీటి పర్యంతం-ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని వేడుకోలు- నిద్రావస్థలో విద్యాశాఖ**




తిరుపతి విద్య, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: జిల్లా విద్యాశాఖను కుదిపేసేలా సమగ్ర శిక్ష విభాగంలో బయటపడిన లైంగిక వేధింపుల ఆరోపణలు ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మహిళా ఉద్యోగి కన్నీటి పర్యంతం అవుతూ న్యాయం కోసం ముందుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడటం, వ్యవస్థ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమాచారం ప్రకారం, సంబంధిత అధికారి తన పదవిని దుర్వినియోగం చేస్తూ మహిళా ఉద్యోగిని పదేపదే వేధించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధి పేరుతో అనవసర పిలుపులు, ఒత్తిళ్లు, అసౌకర్యకర పరిస్థితులు సృష్టించడం ద్వారా బాధితురాలిని మానసికంగా వేధించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమెకు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం కూడా భారంగా మారిందని సహచరులు చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని మొదట అంతర్గతంగా పరిష్కరించే ప్రయత్నాలు జరిగినప్పటికీ, ఫలితం లేకపోయినట్లు సమాచారం. పలుమార్లు హెచ్చరికలు చేసినా అధికారి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, సహచరులు స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి ప్రశ్నించిన ఘటన కూడా చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ స్పందన లేకపోవడం అధికార వ్యవస్థ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు బాధితురాలు అధికారికంగా ఫిర్యాదు చేయడంతోనే ఉన్నతాధికారులు కదిలినట్లు సమాచారం. ఫిర్యాదు వచ్చే వరకు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు ఇప్పుడు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ముందుగానే వచ్చిన సంకేతాలను పట్టించుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘటనతో మహిళల భద్రతపై ప్రభుత్వ హామీలే ప్రశ్నార్థకంగా మారాయి. కార్యాలయాల్లోనే మహిళలు అసురక్షి తంగా భావిస్తే, బయట పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మహిళా రక్షణపై మాటలు మాత్రమేనా? అమలు ఎక్కడ? అన్న ప్రశ్నలు గట్టిగా వినిపిస్తు న్నాయి. ఇక ప్రతిపక్షాలు ఈ ఘటనను తీవ్రంగా ఎత్తిపోస్తూ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. ఫిర్యాదు తర్వాతే చర్యలు అంటే ఇది పరిపాలనా వైఫల్యం కాదా? అంటూ నిలదీస్తున్నాయి. ముందస్తు హెచ్చరికలు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నిస్తున్నాయి.ఉద్యోగ సంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితురాలికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మార్గదర్శకాలు అమలు చేయాలని కోరుతున్నాయి.ఇప్పుడీ ఘటనపై విచారణ ఎలా సాగుతుంది? బాధ్యులపై నిజంగా చర్యలు ఉంటాయా? లేక మరికొన్ని కేసుల్లాగే ఇది కూడా మరుగున పడుతుందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

# సూళ్ళూరుపేట డివిజన్

## సూళ్లూరుపేట తహసిల్దార్‌గా శైలకుమారి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: మండల తహసిల్దార్‌గా శైలకుమారిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. దొరవారిసత్రం మండల తాసిల్దార్‌గా పనిచేస్తున్న శైల కుమారిని సుళ్లూరుపేటకు బదిలీ చేశారు. ఇక్కడ తహసిల్దార్‌గా పనిచేస్తున్న పి.గోపీనాథ్‌రెడ్డి చిల్లకూ రుకు బదిలీ అయ్యారు. అలాగే నాయుడుపేట తహసిల్దారుగా ఉన్న రాజేంద్ర ను దొరవారిసత్రంకు బదిలీ చేశారు. అలాగే నాయుడుపేటకు పెళ్ళకూరు డిప్యూటీ తహసిల్దార్‌గా పనిచేస్తున్న జి యువరాజును తహసిల్దారుగా నియమించారు. నాయుడుపేట సిఎస్‌డిటి ఉన్న సిహెచ్ బెన్నీనీ ఓజిలి మండలానికి తహసిల్దారుగా బదిలీ చేశారు. దీంతో సుళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలకు నూతన తహసిల్దార్లు తమ పదవి బాధ్యతలను చేపట్టారు.

## ప్రసాద్‌కు నివాళులు అర్పించిన నెలవల



పెళ్లకూరు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: మండలంలోని కానూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల ప్రసాద్ యాదవ్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆదివారం తన స్వగ్రామ మైన కానూరులో మృతి చెందగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంప్రసాద్ యాదవ్ మృతదేహాన్ని సందర్శించి నివాళుల ర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నెలవల ప్రసాద్ మండలంలో పార్టీ గెలుపుకు ఎనలేని కృషి చేశాడని నిజంగా ఆయన లేని లోటు మానవులేనిదని అన్నాడు. అనంతరం కుటుంబ సభ్యులకు పార్టీ పరంగా మీకు ఎలాంటి సహాయం కావాలన్నా చేయడానికి పార్టీ వెనకాడదని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాడు. ప్రసాద్ యాదవ్ మృతదేహానికి నివాళులర్పించిన వారిలో పెళ్లకూరు మండలానికి చెందిన తెదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్, మదన్ మోహన్ నాయుడు, సిద్దులయ్య నాయుడు, పాలచ్చురు నరేంద్ర, ఉన్నారు.

## కోడి పందెం రాయుళ్ళపై పోలీసులు దాడులు



సూళ్లూరుపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట డీఎస్పీ సూళ్లూరుపేట సీఐ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేట మండలంలోని దామా నెల్లూరు గ్రామంలోని ఫారెస్ట్ ప్రాంతంలో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నాలుగు కోళ్లు, నాలుగు కత్తులు, ఐదు మోటార్ సైకిళ్లు మరియు రూ. 10,200 నగదును స్వాధీనం చేసుకొన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట డీఎస్పీ సూళ్లూరుపేట సీఐ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సూళ్లూరుపేట మండలంలోని దామా నెల్లూరు గ్రామం లోని ఫారెస్ట్ ప్రాంతంలో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

## శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరునికి కల్యాణం



వడమాలపేట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వం స్వామివారి కల్యాణం ఆదివారం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. శ్రవణా నక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం, ఆ శుభదినాన ప్రతినెల స్వామివారికి కల్యాణం నిర్వహించడం అప్పలాయగుంటలో ఆనవాయితీ. ఆదివారం వేకువ జామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు స్వామివారి, ఉభయదేవేరుల ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు తిప్పయాచార్యులు అగ్ని హోమం నిర్వహించి టీటీడీ లాంఛనాలతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ శ్రీవారు శ్రీదేవి భూదేవి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. కల్యాణోత్సవం టికెట్లు తీసుకున్న దంపతులు స్వామివారి కల్యాణాన్ని తనివితీరా తిలకించి పులకించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, షరాబు రవీంద్ర, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

**జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి**



సత్యవేడు, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన ఏడు మండలాల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం స్థానిక వీకేఎం కల్యాణ మండపంలో తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అధ్యక్షతన, సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీకి అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, రాష్ట్ర యాదవ సంఘ అధ్యక్షులు నరసింహ యాదవ్ అధ్యక్షతన నియోజక వర్గంలోని ఏడు మండలాలకు చెందిన నూతన మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడు(సత్యవేడు), మునస్వామి యాదవ్ (కేవీబీపురం), ప్రణీత్‌రెడ్డి (నాగలాపురం), సతీష్‌నాయుడు (పిచ్చాటూరు), గిరిబాబు (నారాయణవనం), యుగంధర్‌రెడ్డి (వరదయ్యపాళెం), చెంచురామానాయుడు (బుచ్చినాయుడు కండ్రిగ) చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే హేమలత, స్థానిక జడ్పీటీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ మండల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ అందరిని సమన్వయం చేసుకుంటూ పార్టీలో అంతర్గత విభేదాలకు తావు లేకుండా చూడాలన్నారు. టీడీపీ(కూటమి) ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసిన పథకాలను ప్రజల మధ్యలోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాల న్నారు. అనంతరం నూతనంగా అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ ంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ మస్తాన్, నాయకులు పరమశివం, పృథ్వీ, సంతోష్, దాము, కిరణ్, కోనయ్య, శివయ్య, చికెన్ చిన్న సునీల్‌జైన్, మోహన్ రెడ్డి, శరత్, తులసి, నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు



చంద్రగిరి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ తిరుచ్చి వాహన సేవ వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ ఆనుంబట్టు ధనశేఖర్, అర్చకులు మురళికృష్ణమాచార్యులు, జమేధార్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

# స్లీపర్ బస్సు స్వాధీనం.. 40 వాహనాలపై కేసులు

తిరుపతి రవాణ ఏప్రిల్ 12 ప్రభాత వార్త




తిరుపతికి వస్తున్న కాంట్రాక్ట్ క్యారేజ్ వాహనాలపై జిల్లా రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు చేపట్టి నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంది. ఈ తనిఖీల్లో ఒక స్లీపర్ బస్సును స్వాధీనం చేసుకోగా, మరో 40 వాహనాలపై కేసులు నమోదు చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు గత వారం రోజులుగా మూడు ప్రత్యేక బృందాలు ప్రధాన రహదారులు, చెక్‌పోస్టులు, టోల్ గేట్ల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహించాయి. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీలలో జగదల్పూర్ నుంచి తిరుపతి వైపు వస్తున్న ఒక కాంట్రాక్ట్ క్యారేజ్ స్లీపర్ బస్సు ఏ ఐ ఎస్ 119 నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించారు. వాహన

## నిబంధనల ఉల్లంఘనలపై ఆరు లక్షల జరిమానా

## ప్రయాణికుల భద్రతపై రాజీ లేదు: ఆర్టీఏ అధికారి కొర్రపాటి మురళీమోహన్

నిర్మాణం, బెర్త్ అమరిక, అత్యవసర నిష్క్రమణ మార్గాలు, భద్రతా ప్రమాణాల్లో లోపాలు ఉన్నందున ఆ బస్సును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇతర బస్సులపై నిర్వహించిన తనిఖీలలో అగ్నిమాపక పరికరాలు లేకపోవడం, అత్యవసర ద్వారాల లోపాలు, అధిక ప్రయాణికులు, అవసరమైన పత్రాలు లేకపోవడం వంటి ఉల్లంఘనలు గుర్తించారు. మొత్తం 40 వాహనాలపై కేసులు నమోదు చేసి, సుమారు ఆరు లక్షల రూపాయల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో మోటార్ వాహన తనిఖీ అధికారులు దామోదర్ నాయుడు, శ్రీనివాసరావు, మోహన్ కుమార్, అతికానాజ్, రమణ నాయక్, ఆంజనేయ ప్రసాద్, వర్మ, స్వర్ణలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారి కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగించే విధంగా నిబంధనలు ఉల్లంఘించే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఈ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు, వాహన యజమానులు నిబంధనలు పాటించి రహదారి భద్రతకు సహకరించాలని కోరారు.

## నేడు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్

తిరుపతి, కలెక్టరేట్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మీడియాకు తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## దుర్గసముద్రంలో భూమి కొనుగోలులో మోహిత్ రెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం

### – గ్రామస్తులు శివయ్య, రామచంద్రయ్య

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రంలో భూమి కొనుగో లులో మోహిత్ రెడ్డి వ్యాఖ్యలు అవాస్తవమని గ్రామస్తులు శివ య్య, రామచంద్రయ్య ఆరోపిం చారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాయింట్ కలెక్టర్ అశోక్ కుమార్ ద్వారా గ్రామ లెక్క దాకాలలో 135/1లో ఎ5.98 సెంట్ల భూమికి సంబంధించి తాము కొనుగోలు చేశామని, ఇందుకు సంబంధించి కోర్టు నుండి ఉత్తర్వులు కూడా తమ వద్ద ఉన్నాయని గ్రామస్తులు శివయ్య, రామచంద్రయ్య తెలిపారు. ఇనాందారు శ్రీనివాసన్‌కు రైత్వారి పట్టాను మంజూరు చేశారన్నారు. ఆయన వారసుల నుండి తాము భూమిని కొనుగోలు చేశామన్నారు. ఈ సర్వే నంబర్లోని ఎ. 7.98 సెంట్లు రెండు ఎకరాలు పాఠశాల వినియోగానికి అప్పుడే అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 27 సెంట్లు భూమిని స్వర్ణముఖి నది మార్గం కోసం విడిచి పెట్టడం జరిగిందన్నారు. మిగిలిన భూమిని గ్రామస్తులలో 12 మంది శ్రీనివాసన్ వారసుల నుండి కొనుగోలు చేసి 2019లో హైకోర్టు ఉత్తరం మేరకు పట్టాలు పొందడానికి అర్హత సాధించామన్నారు. ఇటీవల అడంగల్ కాపీలలో తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఎక్కడ గాని తాము భూ ఆక్రమణకు పాల్పడలేదని స్పష్టం చేశారు. ఇందులో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి గానీ ఎటువంటి సంబంధం లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు సంబంధించిన భూమిపై మాట్లాడాలని విషయం కూడా తమకు తెలియదని, కేవలం మోహిత్ రెడ్డి చేసిన ఆరోపణలకు మాత్రమే స్పందించమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లీలావతమ్మ, చెంగల్రాయులు, దేశిరెడ్డి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మే 10న సౌత్ ఇండియా కురుబ సంఘం

### సర్వసభ్య సమావేశం విజయవంతం చేయండి

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త



సౌత్ ఇండియా కురుబ, కురుమ, కురుంబన్, గురువాహన్, దంగర్ సంగం వివిధ పేర్లతో పిలవబడే జాతీయ సంఘం ఆధ్వర్యంలో మే 10న రామ తులసి కళ్యాణ మండపంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రాలలో, శ్రీధర్ పేర్లతో పిలవబడుతున్న కురుబల ఐఖ్యత కోసం, సమిష్టి కృషితో క్షేత్ర సాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నామని, కురుబ కురుమ సౌత్ ఇండియా రాష్ట్ర నాయకులు జబ్బల శ్రీనివాసులు చెప్పారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటగా కురుపులను గుర్తించింది వైఎస్ఆర్సిపి నాయకులు జగన్ మోహన్ రెడ్డి గుర్తించి రెండు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ టికెట్ కేటాయించడం, యువ నాయకులు నారా లోకేష్ పాదయాత్రలో కురుపులను గుర్తించి గత ప్రభుత్వం కంటే మిన్నగా కురుపుల అభివృద్ధి కోసం సీట్ల కేటాయిస్తామని, రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని రెండు ఎంపీ, టికెట్లు రెండు ఎమ్మెల్యే టికెట్లు కేటాయించడం పట్ల ఇరువురికి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మా పోరాట ఫలితంగానే ఇప్పుడు కురుపులకు నామినేటెడ్ పదవులు గాని, ఎమ్మెల్యే గాని, ఎంపీ సీట్లు గాని, ప్రభుత్వాలు కేటాయిస్తున్నాయి అంటే, కురుబల పోరాట ఫలితంగానే జరిగాయని దెబ్బల శ్రీనివాసులు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది ఈ సర్వసభ్య సమావేశానికి హాజరుకానున్నారని, రాజకీయ ప్రాతినిధ్యం కురుపులను గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. తిరుమలలో భక్త కనకదాసు మఠం కేటాయించడంలో ప్రభుత్వం చొరవ తీసుకొని స్థలం కేటాయించాలని రెడ్డి కుమార్ గౌడ్ కోరారు. తిరుపతి చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో కురుబ కులస్తులకి కురుబ భవన్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. స్థలం కేటాయించని పక్షంలో తానే ప్రభుత్వ వ్యాల్యూ ప్రకారం భూమిని కేటాయిస్తే ప్రభుత్వానికి మార్కెట్ విలువ చెల్లించి తామే నిర్మించుకుంటామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సౌత్ ఇండియా నాయకులు జబ్బల శ్రీనివాసులు, లాయర్ రవిశంకర్, రెడ్డి కుమార్ గౌడ్, రమణ, ఆడిటర్ ఆనంద్, అన్నమయ్య జిల్లా నాయకులు ఈశ్వరయ్య, కొల్లే ఇంద్ర కుమార్, గుడి రామాంజనేయులు, తంబళ్లపల్లి సర్పంచ్ శ్రీనివాసులు, కురుబ సంఘం యువ నాయకులు గుడి శివ తదితరులు పాల్గొన్నారు.

## పాత జీవనానికి స్వస్తి పలికి కొత్త జీవనాన్ని అలవర్చుకోండి

### అర్బన్ సీఐ జయచంద్ర

రేణిగుంట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త..



పాత నేర జీవనానికి పూర్తిగా స్వస్తి పలికి కొత్త జీవనాన్ని అలవర్చుకోవాలని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర రౌడీ షీటర్లకు, అనుమానితులకు పిలుపునిచ్చారు.. రేణిగుంట అర్బన్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీనివాసరావు సూచనలతో సీఐ జయచంద్ర అనుమానితులకు రౌడీషీటర్లకు సత్ప్రవర్తన కలిగి ఉండాలంటూ కౌన్సిలింగ్ ఇచ్చారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులను పిలిపించి వారి జీవన విధానాన్ని పూర్తిగా తెలుసుకుంటున్నామన్నారు. సత్ప్రవర్తన అలవర్చుకున్న వారిని ఎప్పటికప్పుడు వాకబు చేస్తామన్నారు. ఎవరైతే రౌడీయిజానికి దూరంగా ఉంటూ మంచి పౌరులుగా జీవిస్తారో వారిని గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి వారిపై ఉన్న రౌడీ షీట్లు ఎత్తేస్తామని తెలిపారు. ఎవరు పుట్టుకతో చెడ్డవారు కాదని కొంతమందిని పరిస్థితులు మరి కొంతమంది చెడు సహవాసాలతో రౌడీయిజం చేస్తారని అటువంటి వారికి చట్టం మారడానికి అవకాశం కల్పిస్తుందని అలా మారిన వారు సంఘములో ఎంతోమంది ఉన్నారన్నారు. రౌడీ షీటర్ లంతా మంచి ప్రవర్తనతో మెలిగి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ధర్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

## ప్రజలకు పోలీసుల అండం ఉంటుంది: ఎస్సై

రేణిగుంట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



ప్రజలకు ఎప్పుడు పోలీసుల అండ ఉంటుందని గాజులమండ్యం ఎస్సై హరీష అన్నారు.. ఆదివారం సాయంత్రం గాజులమండ్యం సర్కిల్ వద్ద జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో ఎస్సై హరీష వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల లైసెన్సులు, వాహనాల రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ లు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె తమ సిబ్బందితో కొత్త మంగళం చేరుకుని అక్కడ ప్రజలకు పోలీసు వ్యవస్థ ఉందంటూ ధైర్యం కల్పించారు. ఈ మధ్యకాలంలో ఆగంతుకుల సంచారం ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎవరైనా కొత్తవారు గ్రామంలో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవికాలం ఆరుబయట నిద్రించేవాళ్లు విలువైన ఆభరణాలు భద్రపరుచుకోవాలి అన్నారు. ఎవరైనా వేసవి సెలవులకు ఊరు వదిలి వెళ్లాల్సి వస్తే ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ను వినియోగించుకోవాలని తెలిపారు. యాప్ ఏర్పాటు చేసుకున్న ఇళ్ళలో పోలీసులు కెమెరాలు అమర్చి ఇంటి యజమానులు వచ్చేవరకు ఇల్లు పోలీసుల నిఘానేత్రం నీడలో ఉంటాయని తెలిపారు.

## నందమూరి బాలకృష్ణకు స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 12 ప్రభాతవార్త.




ప్రముఖ సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం సాదర స్వాగతం లభించింది. తిరుపతిలో జరిగే వివాహ కార్యక్రమంలో పాల్గొనడానికి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు విమానాశ్రయం నందు ఉమ్మడి చిత్తూరు జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి రెడ్డి వారి గురవారెడ్డి తన మిత్రులు అనుచర గణంతో సాదరంగా స్వాగతం పలికి పూల బొకే ఇచ్చి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం బాలకృష్ణ రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సేవలో సమాచార కమిషనర్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ గాజుల ఆదెన్న కుటుంబ సభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద బికె వెంకటేశులు ప్రోటోకాల్‌ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ క్రమాన్ని, ఎప్పుడు నిర్మించారు? అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ చక్కగా ఉందని ప్రశంసించారు. వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఇఓ వెంకటేశులు స్వామి అ మ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## 14న మెగా రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని అంబేద్కర్ యువజన సేవా శిబిరం సారధ్యంలో ఈ నెల 14 అంబేద్కర్ 135జయంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం బహాదూరుపేటలోని నల్లగంగమ్మ ఆలయం వద్ద రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రక్తదాన శిబిరాన్ని నల్లగంగమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిదాయకంగా సామాజిక సేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలనే భావంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా ఈ నెల 14తో యువజన సేవా సంఘానికి పాతికేళ్ళు నిండుతుందని ఈ సందర్భంగా భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో సంఘానికి చెందిన ఎం.శివ, శంకర్, ఏవి రాజా, ఎన్‌శేఖర్, మనోజ్‌లు పాల్గొన్నారు.

## ఏడు గంగమ్మలకు వెండి కిరీటం బహూకరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల ఆలయంలో వెలసిన అమ్మవారికి శ్రీకాళహస్తికి చెందిన వి.కామేశ్వరి రూ.లక్ష విలువ కల్గిన వెండి కవచాన్ని బహూకరించారు. ఆదివారం సాయంత్రం కవచాన్ని ఆలయ ఇఓ బికె వెంకటేశులుకు అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల నుంచి విరివిగా విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు ఏడుగంగమ్మల ఆలయంలో వెలసిన అమ్మవారికి విరాళం అందించటం అభినందనీయం అని ఇఓ అభినందించారు. వారికి స్వామి అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక దర్శనం వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, చిన్నఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంజిఎంలో రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రి, ఇండియన్‌రెడ్‌క్రాస్ సొసైటి సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి స్పందన వచ్చింది. ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో రాజస్థాన్ నవయువక్‌మండల్ సౌజన్యంతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరం పట్టణంలోని జెట్టిపాళెంలో జైన్స్ ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసారు. సుమారు 110 మంది యువకులు పాల్గొని రక్తదానాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లోఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి చైర్మెన్ ఎంజిఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ నవయువక్ మండల్ సేవలను కొనియాడారు. ప్రతి ఏడాది నవయువక్ మండల్ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని గతంలో కంటి వైద్యశిబిరం నిర్వహించి ఎందరికో కంటి చూపు అందించారన్నారు. నవయువక్ మండల్ నిర్వహించే కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలను అందిస్తామని వివరించారు.

## ప్రణీత్‌రెడ్డిని ఘనంగా సత్కరించిన టీడీపీ నాయకులు

నాగలాపురం, ఏప్రిల్ 12 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గంలో గత కొంత కాలంగా టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు పదవి కోసం టీడీపీ పార్టీ శ్రేణులు చాలా ఆత్రుతగాఎదురు చూస్తూ ఉన్నారు. టీడీపీ పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి తీవ్ర కసరత్తు చేశారు. టీడీపీ పార్టీ శ్రేణుల అభిప్రాయం సేకరణతో పాటు అందరికి ఆమోదకరమైన అభ్యర్థులను ఎంపికచేసి ఏడు మండలాల అధ్యక్షులను కూరపాటిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ప్రకటించారు. టీడీపీ పార్టీ ఏడు మండలాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారంను సత్యవేడు(వీఎంకే) కల్యాణ మండపంలో టీడీపీ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, రాష్ట్ర యాదవసంఘం కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నియోజకవర్గ టీడీపీ పార్టీ కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకురాల మధ్యన చాలా ఘనంగా అట్టహాసంగా ప్రమాణ స్వీకారం కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం నాగలాపురం మండల పార్టీ అధ్యక్షుడు ప్రణీత్‌రెడ్డిని మండలానికి చెందిన నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకంతో ఈ పదవిని కట్టపెట్టడం చాలా సంతోషంగా ఉందని, మండలంలోని అన్ని నాయకులను కలుపుకుని మండలఅభివృద్ధి, స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా అన్ని పదవులని కైవసం చేసుకుని పార్టీని ముందుకు నడిపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పల్లికొండేశ్వర పాలక మండలసభ్యులు నెల్సన్ మండేలా, మండల మాజీ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, నరేంద్రరెడ్డి, చాన్‌బాషా, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లల మొబైల్ వాడకంపై నిఘా అవసరం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 12 ప్రభాతవార్త



మన పిల్లలు మొబైల్ వాడకంలో ఏం చూస్తున్నారు? ఏం చేస్తున్నారనే పర్యవేక్షణ తల్లిదండ్రులపై ఉందని కెసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెసి కృష్ణ అన్నారు. ఆదివారం పాఠశాల 34వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిలకారంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రదానోపాధ్యాయులు కెసి కృష్ణ అధ్యక్షత వహించగా వ్యవస్థాపకురాలు పి.మాలతి పాఠశాల ప్రగతిని విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా ఓ పాఠశాలను నిర్వహించటం సామాన్యమైన విషయం కాదన్నారు. అయితే క్రమశిక్షణకు మారుపేరైన కృష్ణ ప్రధానోపాధాయులు కావటం ఇక్కడి విద్యార్థుల అదృష్టం అన్నారు. వ్యవస్థాపకురాలు మాలతి మాట్లాడుతూ మా పాఠశాలలో చదివిన ఓ విద్యార్థి నేడు అత్యున్నత స్థానంలో ఉండటం మా పాఠశాలకు గర్వకారణమన్నారు.

ఇక్కడ ఒక్క చదువుకే కాకుండా యోగా, వ్యాయామం, కల్చరల్ కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ప్రదానోపాధ్యాయులు మాట్లాడుతూ నేడు పిల్లలు సెల్ ఫోన్లకు బానిసలయ్యారన్నారు. తల్లిదండ్రులు వారికి సెల్‌ఫోన్లు ఇవ్వటంను ప్రమాదకరమన్నారు. ఇక వారు సెల్‌ఫోన్లో ఏం వీక్షిస్తున్నారనేది గమనించాలన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. విద్యార్థులచే నిర్వహించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో సీనియర్ ఉపాధ్యాయురాలు వందన, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.